Whatsapp No: 9440662699 www.rajadhanivartalu.com facebook.com/rajadhaniv RNI No. APTEL 2015/ 66622

# రాజధాని వార్తలు

Voice of Voiceless




అమరావతి సంపుటి : 2 సంచిక 42, పేజీలు 8 రూ. 2/- ఆంధ్రప్రదేశ్ ' రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 10- ఆదివారం 16, జూలై 2017

# మనసున్న మారాజు

## వైసీపీ జాతీయ ప్లీనరీకి భారీగా తరలివచ్చిన నేతలు, కార్యకర్తలు



**గుంటూరు:** వైసీపీ మూడో జాతీయ ప్లీనరీ సమావేశాలు గుంటూరు-విజయవాడ జాతీయ రహదారి పక్కన ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఎదుట మైదానంలో అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. పార్టీ ప్లీనరీ సమావేశంలో మొత్తం 18 తీర్మానాలపై చర్చ జరుగనున్నది. జాతీయ స్థాయి ప్లీనరీ సమావేశాలకు ఇటు ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ నేతలే కాక తెలంగాణ నుంచి కూడా వైసీపీ నేతలు హాజరయ్యారు. జర్మన్ టెక్నాలజీతో వేదిక ఆకర్షణగా తీర్చిదిద్దారు. పదివేల మందికి పైగా నాయకులు, కార్యకర్తలు కూర్చునేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పార్టీ అధినేత జగన్‌తో పాటు ముఖ్య నేతలు ఆశీనులయ్యే వేదికతో పాటు నాయకులు, కార్యకర్తలు కూర్చొనేలా ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. పక్కనే మీడియా గ్యాలరీను కూడా ఏర్పాటు చేశారు.

### జగన్ ప్రారంభోపన్యాసం

వైఎస్‌ఆర్ సీపీ జాతీయ ప్లీనరీ సమావేశాల్లో వైసీపీ అధినేత వైఎస్ జగన్ శనివారం ప్రారంభోపన్యాసం చేశారు. "ఈరోజు మూడో ప్లీనరీ జరుపుకుంటున్నాం. రాష్ట్రం నలుమూలల నుంచి ఇక్కడకు వచ్చిన కుటుంబసభ్యులందరికి, ఆత్మబంధువులందరికీ పేరు పేరునా నమస్సుమాంజలి తెలుపుకుంటున్నా. ఇవాళ నా తండ్రిగారు, మహానేత దివంగత వైఎస్‌ఆర్‌గారు 68వ జయంతి నాడు అందరం ఒక్కచోట ఏకమయ్యాం. మనం అందరం కూడా ఎందరో ముఖ్యమంత్రులను చూశాం. కానీ ఇవాళ్టికి కూడా అందరి గుండెల్లో చెరగని ముద్ర వేయించుకున్న ఏకైక వ్యక్తి వైఎస్ఆర్. ఆయన చనిపోయి దాదాపు ఎనిమిదేళ్లు అవుతున్నా... పెద్దాయనగా, మన ఇంట్లో వ్యక్తిగా అందరి మనసుల్లో నిలిచిపోయంది ఎవరైనా ఉన్నారంటే ఆయన వైఎస్ఆర్. ఆయన మన మధ్య లేకపోయినా వైఎస్ఆర్‌ను జ్ఞాపకం చేసుకుంటున్నాం" అని ఆయన అన్నారు. చంద్రబాబు పాలన ఎప్పుడెప్పుడు పోతుందా అని ఎదురు చూస్తున్నారు. ఇంతటి దుర్మార్గమైన, అన్యాయమైన పాలన చూడలేదని ప్రజలు అనుకుంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేక నిర్ణయాలపై చేసిన పోరాటాలను గుర్తు చూసుకుంటూ దశాదిశా నిర్దేశం కోసం, భవిష్యత్‌లో ఏం చేయాలన్న దానిపై చర్చించి కలిసికట్టుగా ఆమోదించుకుందాం. రేపు ఆయన సుదీర్ఘ ప్రసంగం ఉంటుందని, ప్లీనరీలో 20 తీర్మానాలు చేయబోతున్నామని తెలిపారు. ప్రజల సలహాలు, సూచనలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.

### ఆకట్టుకునేలా స్వాగత ద్వారాలు..

ప్లీనరీ సమావేశాలకు వచ్చే నాయకులు, కార్యకర్తలను ఆకట్టుకునేలా స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. పల్నాటి బ్రహ్మనాయుడు, పొట్టి శ్రీరాములు, కూచిపూడి నృత్యకళాకారులు, వంగవీటి మోహన్‌రంగాతో పాటు పలువురు నేతల పేర్లుతో కూడిన స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి నుంచి సమావేశ ప్రాంగణం వరకు స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. అలాగే ఆ పార్టీ నేతలు అధినేత జగన్‌కు స్వాగతం పలుకుతూ పోటీపోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

### జిల్లా సమస్యలపై కీలక తీర్మానాలు

పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి జిల్లాకు సంబంధించిన కీలక అంశాలపై పార్టీ అధినేత, ప్రధాన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో జాతీయ ప్లీనరీలో తీర్మానాలు ప్రవేశపెట్టనున్నారు. జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో గల ప్రధాన సమస్యలను తీర్మానాల జాబితాలో చేర్చారు. నెల్లూరు బ్యారేజి పనులు పూర్తి చేయాలని, మెట్ట ప్రాంతాలకు

- మిగతా 2 లో

# రాష్ట్రంలో నూతన రవాణా వ్యవస్థ



**అమరావతి :** రాష్ట్ర రవాణా వ్యవస్థను ఆధునీకరించేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారు. అందులో భాగంగా మంత్రి పి. నారాయణ నేతృత్వంలో మంత్రులు చైనాలో ఎలక్ట్రిక్ బస్సు, అటానమస్ రైల్ ట్రాన్సిట్ సిస్టంలను పరిశీలించింది. వీటిల్లో తక్కువ ఖర్చుతో రూపొందించగలిగే ఎలక్ట్రిక్ బస్సులు పర్యావరణహితమైనవే కాకుండా ఎక్కువమంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తాయి. అటానమస్ రైల్ ట్రాన్సిట్ సిస్టంలో పేరులో రైలున్నప్పటికీ ఇది రైలు, బస్సు మిశ్రమంతో కూడింది. 3 కంపార్టుమెంట్లతో ఉండే ఇది పట్టాలపై కాకుండా సెన్సర్లు ఉండే లైనుపై నడుస్తుంది. రబ్బరు టైర్లు, ప్లాస్టిక్ రిమ్ములతో నడిచే ఇవి 10 నిమిషాలపాటు ఛార్జింగ్ చేస్తే 25 కిలోమీటర్లు నడుస్తాయి.

ఒకేసారి 300 మందిని మోసుకు వెళ్లగలవు. అవసరమైతే మరొక కంపార్ట్‌మెంట్‌ను అదనంగా జతపరిచే అవకాశముంటుంది. మెట్రో రైలుతో పోల్చితే వీటి ఏర్పాటుకయ్యే ఖర్చు తక్కువ. బీఆర్టీఎస్ మార్గంలో వీటిని నడపవచ్చు. వీటివల్ల కాలుష్యం వెలువడనందున పర్యావరణహితంగా నిర్మిస్తున్న అమరావతికి అనువుగా ఉంటాయి. రాజధానితోపాటు రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నంలలో వీటి ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై నారాయణ బృందం చైనా అధికారులతో చర్చించింది. ప్రపంచంలోనే తొలిసారిగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టి, విజయవంతమైన దరిమిలా వాటిని మన రాష్ట్రంలోనూ ప్రవేశపెట్టడంపై వారితో సంప్రదింపులు

- మిగతా 2 లో

# చేనేతపై జీఎస్టీ పిడుగు



**రా.వా. (విశాఖ) :** చేనేతపై వస్తు,సేవల పన్ను అమలు ఎలా ఉంటుందోనని కార్మికులు బెంబేలెత్తుతున్నారు. అందమైన చేనేత చీరలకు తయారు చేసి ఖాదీజూరా ఎగ్జిబిషన్ ద్వారా అమ్మకాలు జరుపుతున్న చేనేత కార్మికులకు వస్తుసేవల పన్ను భారంపై అవగాహనలేదు. రానున్న శ్రావణమాసంలో అమ్మకాలు పెరిగి తమ వ్యాపారాలు బాగుంటాయనుకుంటే, ఉన్ని, సిల్కువస్త్రాలపై పన్ను తగ్గించిన కేంద్రం నూలు, చేనేతపై పన్ను పెంచి కార్మికులను కోలుకోలేని దెబ్బ తీస్తోందని చేనేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యధిక వసూళ్ల చేపట్టిన బాహుబలి సినిమాలోని ప్రభాస్,అనుష్కల ఆకర్షణీయమైన పోస్టర్‌ను చీరలపై నేసి తమ పనితనాన్ని ప్రజల ముందుకు తీసుకురావాలనుకున్నామని అయితే తమ భవిష్యత్ ప్రశ్నార్థకంగా

- మిగతా 2 లో






# రాజధాని వార్తలు

కలం

## పదవీ వ్యామోహం తగదు

ఎన్నాళ్లు బ్రతికామన్నది ముఖ్యంకాదు.. ఎలాంటి విలువలతో బ్రతికామన్నది ముఖ్యం.. అలాగే ఎంతకాలం పాలించామనికాదు.. ఎంత మంచి పాలనను అందించామన్నది ముఖ్యం. దీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేస్తున్న చంద్రబాబు ఇటీవల తరచుగా మనం అధికారాన్ని నిలబెట్టుకోవాలి, శాశ్వతంగా మనమే పాలించాలి లాంటి వ్యాఖ్యలతో వివాదాస్పద మవుతున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు వారి నాయకులును ఎంపిక చేసుకునే బాధ్యత, అవకాశం ఉన్నాయి. దీంతో ఎన్నికల ప్రచారంలో చేసిన వాగ్దానాలను అమలు చేసి నమ్మకాన్ని వమ్ముచేసుకోకుండా వారి హృదయాల్లో సుస్థిర స్థానాలు ఏర్పాటు చేసుకోవాలి.

ఇదంతా నాణేనికి ఒకవైపు అయితే రెండో వైపు కూడా ఆలోచించాలి. ఎంతకాలం ఇదే పదవిలో పదవికోసం అర్రులు చాస్తూంటారు ? మిగతావారికి కూడా ఛాన్సు ఇవ్వాలిగా లేదంటే ప్రజాస్వామ్యానికి రాజరికానికి తేడా ఏముంటుంది? దేశంలో అత్యంత కాలం 1977 జూన్ 21 నుంచి 2000 నవంబరు వరకు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి పశ్చిమ బెంగాల్‌కు చెందిన జ్యోతి బసు. ఆయన కమ్యూనిష్టుపార్టీకి చెందినవారు. తన వారసులను ఎవ్వరినీ రాజకీయాల్లోకి తీసు కురాలేదు. చివరిలో మాత్రం వయస్సుకారణంగా పక్కకు తప్పుకుంటున్నానంటూ బుద్ధదేవ్ బట్టాచార్యను ముఖ్యమంత్రిగా ప్రకటించారు. ఆయన హయాంలోనే సింగూర్‌లో టాటా సంస్థ నెలకొల్పి నానోకార్ల ఫాక్టరీని నిరసిస్తూ ప్రతిపక్షనేతగా ఉన్న మమతాబెనర్జీ ప్లాంటును తొలగించేవరకు నానాయాగీ చేశారు. ఆ ఫ్యాక్టరీని తమ రాష్ట్రంలో ఏర్పాటు చేసుకోవాలంటూ ఈనాటి ప్రధాని ఆనాటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడీ ఆహ్వానం పలుకుతూ రతన్ టాటాకు లేఖరాసిన దరిమిలా ఆయన తన ప్లాంటును అక్కడికి తరలించారు. దీంతో గుజరాత్ పారిశ్రామికంగా ఎంత ముందంజలో ఉందో చూడండి, దేశాన్ని అలా మార్చుతానంటూ మోడీ ప్రధానిగా ఎన్నికవ్వడానికి దాన్నొక సాధనంగా ఉపయోగించుకున్నారు. ఇంతకీ చెప్పవచ్చేదేమిటంటే జ్యోతిబసు కంటే కూడా అతిదీర్ఘకాలం పనిచేయాలని చంద్రబాబు అనుకోవడం అత్యాశే.. మనిషికి ప్రపంచం, పదవులపై అటాచ్‌మెంటే కాదు.. డిటాచ్ మెంట్‌కూడా ఉండాలి. అప్పుడే జీవితంలో ప్రశాంత ఉంటుంది. లేదంటే అలవికాని, గమ్యాలు నిర్దేశించుకొని సతమతమవుతూ వాటిని సాధించడం కోసం ఒత్తిడితో పక్కదార్లు తొక్కుతుంటారు. ఇలాంటి ఒత్తిడితోనే నంద్యాల ఉప ఎన్నికల్లో నారోడ్లపై తిరగవద్దు..నేనిచ్చే రేషన్ తినొద్దు..నేను ఇచ్చే పింఛన్ తీసుకోవద్దంటూ నానాయాగీ చేశారు. అదికాస్త జాతీయ మీడియాలో ప్రసారమై, అనేక చర్చలకు దారి దీసింది. ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు దీనిపై ఆగ్రహం వ్యక్తం చేశాయి.

ఈ పరిస్థితుల్లో ప్రజల అవసరాలను, ఇబ్బందులను గ్రహించి వారికి అణుగుణంగా కార్యక్రమాలను నిర్వహిస్తూ, ఆదేశాలు జారీ చేసి వాటిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లే విధంగా మంత్రులను, అధికారులను ఆయత్తంచేసి తదనుగుణంగా నాయకుడిగా గుర్తింపు పొందాలి. అంతేగాని ప్రతీదీ తనే చేయాలని, తానుమాత్రమే తెలివిగలవాడిననుకొని అధిక పనుల నిర్వహణతో ఒత్తిడిపెంచుకొని అవి తప్పులకు దారితీసే పరిస్థితి తెచ్చుకోకూడదు. జీవిత ప్రయాణాన్ని సౌకర్యవంతంగా చేసుకుంటానికి డిటాచ్‌మెంట్ కూడా ఒక సాధనగా గుర్తించాలి.

**తప్పించుకోడానికి కారణాలు**
**వెతుకుతున్నంత కాలం గెలుపు**
**కనుచూపుమేరలో కనపడదు నీకు...**

పౌరులు-చట్టాలు

## వృత్తి,వ్యాపార నిర్వహణలపై పరిమితులు



**కాటూరు రవీంద్ర త్రివిక్రమ్**
కన్సల్టింగ్ ఎడిటర్, హైకోర్టు న్యాయవాది
98495 68901/83309 68901
katuruRavindraTrivikram@gmail.com



**19** వృత్తి,వ్యాపార నిర్వహణలపై స్వేచ్ఛకి పరిమితులు : రాజ్యాంగ అధికరణం 19(1)(జి) ప్రతి పౌరుడికి స్వేచ్ఛగా వృత్తి వ్యాపారాలు చేసుకునే హక్కుకు హామీ ఇస్తోంది. ఈ హక్కులో భాగంగా వ్యాపారవిరమణ ముగింపు, అమ్మకం వంటిది చేయ వచ్చును. అయితే ఈ క్రింది నిబంధనలకు ఇది లోబడి ఉంటుంది-

(ఎ) సామాన్యప్రజలకు ఉపయుక్తంగా

(బి) క్రింద చెప్పబడిన అంశాల మీద చేయబడే చట్టాలకు లోబడి

(సి) వృత్తి, ఉద్యోగాలకు అవసరమైన సాంకేతిక విద్యార్హతలను కలిగి ఉండటం.

(డి) అధికరణం19(6) క్రింద ప్రభుత్వ నిర్వహణలోని కార్పోరేషన్లు,వ్యాపారాలు, పరిశ్రమలు, సేవలు పూర్తిగా లేక స్థానిక మినహాయింపులు ఈ నిబంధనలన్నీ సర్వజన మరియు దేశ శ్రేయస్సుకోసం ఉద్దేశించినవే.

(శిక్షల నుంచి కొన్ని రక్షణలు :(అధికరణం) ఈ అధికరణం పౌరులకు, పౌరులు కాని వారికి, కొన్ని నేరాల నుంచి రక్షణ కల్పిస్తుంది అవి -

ఎ)సత్యవిరుద్ధ మైన చట్టాల నుంచి(చట్టాల మార్పుద్వారా శిక్ష పడకుండా)

బి)ఒకే నేరానికి ఒకసారికన్నా ఎక్కువ సార్లు శిక్ష పడకుండా,విచారణ జరుగకుండా

సి) తనకు వ్యతిరేకంగా తానే సాక్ష్యం చెప్పేలా వత్తిడి చేయకుండా రక్షణ.

**వివరణ** : ఒక నేరం గత చట్టాల్లో శిక్షార్హం కాకపోతే,తదుపరి చట్టం ద్వారా శిక్షించరాదు. అంటే, నేరం చేసినప్పుడు అమలులో ఉన్న చట్ట ప్రకారమే శిక్షించాలి తప్ప నేరం జరిగిన చాలా కాలానికి చేయబడిన కొత్తచట్టంప్రకారం శిక్ష విధించకూడదు. దీనిని అనుసరించే చట్టాల అమలు రెండు విధానాలు చెప్పారు.

(1) గత కాలానికి వర్తింపజేసే (retrospective) విధానం.

(2) చట్టం చేసిన తేదీ నుండీ ముందు కాలానికి వర్తింపచేయటం (prospective) క్రిమినల్ చట్టాలు గత కాలానికి వర్తింప జేయరు. అధికరణం(20) ఇందుకు నిషేదం విధిస్తుంది.

20(2) అధికరణం ప్రకారం, ఏ వ్యక్తినీ ఒకే నేరానికి రెండుసార్లు విచారించటం, శిక్షించటం నిషేధం. దీనిని double jeopardy కి protection అంటారు.

20(3) అధికరణం ప్రధానం ఒక నేరం చేసిన వ్యక్తి, తనకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వనవసరంలేదు. అలా ఎవరూ బలవంతం చేయకుండా ఈ అధికరణం రక్షిస్తుంది.

(3) ప్రాణం, వ్యక్తి గత స్వేచ్ఛకు రక్షణ (అధికరణం21) : చట్ట విధానం అమలు చేయడం ద్వారా తప్ప ఇతరత్రా ఏ వ్యక్తీ తన ప్రాణం, స్వేచ్ఛను కోల్పోకుండా ఈ అధికరణం రక్షణ కల్పిస్తుంది. ఇది అమాయక పౌరులకే తప్ప క్రిమినల్స్‌కి వర్తించదు.

ప్రాణం (లైఫ్) అంటే,శరీర భాగాలకు సైతం వర్తిస్తుంది. వ్యక్తిగత స్వేచ్ఛ అంటే శరీరానికి మాత్రమే పరిమితం కాదు. ఆ వ్యక్తికి సంబంధించిన అన్ని విషయాలకూ వర్తిస్తుందని సుప్రీంకోర్టు ఒక కేసు తీర్పులో స్పష్టం చేసింది. పాసుపోర్టును తిరస్కరించడం నేరప్రక్రియ లో భాగంకాకపోతే, తిరస్కరించడం వ్యక్తిగత స్వేచ్ఛకు భంగంగానే భావించ పడుతుంది. కాబట్టి, పౌరుల జీవితాలు, స్వేచ్ఛకు సంబంధించిన అనేక అంశాలు మనకు రాజ్యాంగం ప్రసాదించింది.

**(సశేషం)**

## రియల్టర్లకు మంచిరోజు

### త్వరలోనే 1259 ఎకరాలకు అనుమతులు

**రా.వా॥ప్రతినిధి- అమరావతి :** రెండున్నరేళ్ళుగా సీఆర్‌డీఏ పరిధిలో లే అవుట్లకు అనుమతి ఇవ్వలేదు. దీంతో దాదాపు 1259 ఎకరాల్లో లే అవుట్‌లు వేసిన రియల్టర్ల అనుమతులు రాక భారీ పెట్టుబడులు పెట్టి ఈ వ్యాపారంలో దెబ్బతినాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో చాలా తమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆర్థికంగా కృంగిపోయారు. రెండున్నరేళ్ళపాటు పెట్టుబడులు పెట్టి, లే అవుట్‌లువేసిన వారి పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఈ లే అవుట్‌లన్నీ గ్రామ కంఠాలకు 500 మీటర్ల పరిధి లోపల ఉన్నాయి. ఆ కారణంతో సీఆర్‌డీఏ అనుమతులు మంజూరు చేయలేదు. రియల్టర్లు తాము పడుతున్న ఇబ్బందుల గురించి గత రెండేళ్ళుగా ప్రభుత్వానికి విన్నవిస్తూనే ఉన్నారు. రియల్టర్ల గోడు ఆలకించిన ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న 90 లే అవుట్‌లను అనుమతులు ఇవ్వాలని మూడు రోజుల క్రితం జరిగిన క్యాబినెట్ సమావేశంలో తీర్మానం చేశారు. దీంతో 90 లే అవుట్ ల యజమానులు ఊపిరి పీల్చుకున్నారు. లే అవుట్‌ల అనుమతులకు సంబంధించి సంబంధిత అధికారులు విధి విధానాలు రూపొందిస్తున్నారు.

## మనసున్న మారాజు

(మొదటిపేజీ తరువాయి)

నీరివ్వాలని తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. రిలయన్స్ థర్మల్ విద్యుత్ ప్రాజెక్ట్ కోసం తీసుకున్న వేలాది ఎకరాల భూములను రైతులకు తిరిగి అప్పగించాలని, దుగ్గరాజపట్నం, రామాయపట్నం పోర్టు పనులను వెంటనే ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని, సోమశిల హైలెవల్ కెనాల్ పనులను పూర్తి చేయాలని, కోవూరు చక్కెర కర్మాగారాన్ని తక్షణమే తెరిచి, రైతులకు బకాయిలు చెల్లించాలనే డిమాండ్లను తీర్మానాలుగా ప్రవేశపెట్టనున్నారు.

పులికాట్ సరస్సు ముఖ ద్వారంలో పూడిక తొలగింపు పనులు పూర్తి చేయాలని, సోమశిల, స్వర్ణముఖి లింక్ కెనాల్ పనులు పూర్తి చేయాలని, రూ.110 కోట్ల ఆర్థిక భారం నుంచి నెల్లూరు నగరపాలక సంస్థను గట్టెక్కించాలని, నడికుడి-కాళహస్తి రైల్వేలైన్ పనులు పూర్తి చేయాలనే తదితర డిమాండ్లతో కూడిన తీర్మానాలను ప్లీనరీ ముందు ఉంచనున్నారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని 10 నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు ప్లీనరీకి తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అవసరమైన మేర అందరికీ పాస్‌లు పంపిణీ చేశామని, అదనంగా కావాల్సిన వారు సంప్రదించాలని కోరారు.

**3 వేల పాస్‌లు జారీ**

రెండు రోజుల పాటు జరిగే ప్లీనరీలో పాల్గొనేందుకు వీలుగా జిల్లా నేతల ద్వారా 3 వేల 3 వేల పాస్‌లు జారీ చేశారు. పార్టీ పదవుల్లో ఉన్న నేతలు, ముఖ్య నాయకులు, స్థానిక సంస్థల ప్రతినిధులకు ఇప్పటికే పాస్‌లు అందజేశారు. జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల నుంచి పాస్‌ల కోసం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యేలపై విపరీతమైన ఒత్తిడి పెరిగింది. ప్లీనరీ జరిగే ప్రాంగణంలోకి వెళ్లాలంటే పాస్ తప్పనిసరి చేశారు. దీంతో జిల్లా నేతలు మరో రెండు వేల పాస్‌లు తెప్పించే యత్నాల్లో ఉన్నారు.

## చేనేతపై జీఎస్టీ పిడుగు

(మొదటిపేజీ తరువాయి)

మారిందన్నారు. రూ.1000 లోపు చేనేత వస్త్రాల కొనుగోలుపై 5శాతం పన్ను, రూ.1000 దాటితే 12 శాతం జీఎస్టీ అమలులో ఉంది. దీంతో తమకు వచ్చే లాభాలు తగ్గుతాయని చేనేత కార్మికులు వాపోతున్నారు. చీరల రేట్లు పెంచటంవల్ల అమ్మకాలు తగ్గుతాయని కలవరపడుతున్నారు. సాధారణంగా ముడిపదార్థాలను పోచంపల్లి, మంగళగిరి నుంచి సేకరిస్తామని చేనేత కార్మికుడు జె. మోహన్‌రావు తెలుపుతూ ప్రతిచోటా వే బిల్లులను సమర్పించడం కాలాతీతానికి దారితీస్తుందన్నారు. రానున్న కాలంలో జీఎస్టీ అందరికీ ఉపయోగపడుతుందని కేంద్రం చెబుతున్నప్పటికీ మా వ్యాపారంలో ఎలా సహాయం చేస్తుందో అర్థంకావటం లేదన్నారు.

**ఆర్గానిక్ వస్త్రాలకు మంచిరోజులు**

జనపనార, అరటినార నుంచి తయారు చేసే ఆర్గానిక్ వస్త్రాలకు మంచి డిమాండ్ ఉండటం, వాటిపై జీఎస్టీ ప్రభావం లేక పోవటంతో తమ వ్యాపారంపై ఎలాంటి నష్టంలేదని ఈసాన్య ఎకో ప్రొడక్ట్ కంపెనీ ప్రతినిధి గీతా అయ్యర్ తెలిపారు. ముడినూలు పై జీఎస్టీ పన్ను లేకపోవటంతో తమ వ్యాపారంపై ఎలాంటి ప్రభావం చూపదని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. చీరలపై గొడుగు, కెమెరా, సైకిలు, చక్రా, లాంటిది డిజైన్లు త్వరగా అమ్ముడుపోతున్నాయని జయపూర్ ఏ.ఎం. కు చెందిన అఖిలేష్‌గుప్తా తెలిపారు.

రాష్ట్రంలో

## నూతన రవాణా వ్యవస్థ

(మొదటిపేజీ తరువాయి)

జరిపినట్లు నారాయణ చెప్పారు. ఒకవేళ అన్ని అంశాలూ అనుకూలించి, రాష్ట్రంలో వీటిని నడిపినట్లయితే దేశ ప్రజా రవాణా వ్యవస్థలో వినూత్న ఒరవడికి మనమే శ్రీకారం చుట్టినట్లవుతుందన్నారు. ఆయన వెంట రాష్ట్ర పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి కరికాల వళవన్, అమరావతి మెట్రో ఎండీ రామకృష్ణారెడ్డి, ఇతర అధికారులు ఉన్నారు.



# మహిళా క్రికెటర్ల జైత్రయాత్ర



భారత్‌లో అన్ని క్రీడల్లోసహా మహిళా క్రికెట్‌ను కూడా పురుషుల క్రికెట్ అణచివేస్తుం దనడంలో సందేహంలేదు. దేశంలో దానికి ఇస్తున్న ప్రోత్సాహం మరే క్రీడలకు దక్కవు. దానిలో భాగంగా మహిళ క్రికెట్‌కు వీక్షకులు ఉండరు, టికెట్లు అమ్ముడుపోవు. ఇంకా చెప్పాలంటే స్పాన్సర్లు కూడా దొరకరు. అన్నీ ప్రతికూల ప్రభావాలే .. క్రికెట్ అంటే ఎంతో మక్కువగల వాళ్లు క్రికెట్ క్లబ్‌లో కోటానుకోట్లుగా మూలుగుతున్న డబ్బును కొంచెం మహిళాక్రికెట్‌కు వాడి దాన్ని ప్రోత్సహించే ప్రయత్నం ఎవరూ చేయలేదు. ప్రతికూల పరిస్థితుల్లోనే మనుష్యులు రాటుదేలతారని చెప్పటానికి ప్రస్తుత మహిళా క్రికెట్ సాధించిన విజయాలే తార్కాణాలు. మిథలీరాజ్ సారధ్యంలో స్మృతి మంథాన, ఏక్తాబిస్త్‌లు చెలరేగిపోతున్నారు. ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో టీమిండియా 95 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 169 పరుగుల చేసింది. పూనం రౌత్, దీప్తిశర్మలు రాణించారు. పాకిస్తాన్ దాన్ని అధిగమించలేక చతికిల పడి పరువు పోగొటుకోవడంతో భారత్ ఘనవిజయం సాధించింది.

కౌంటీ గ్రౌండ్‌లో శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో భారత్ మహిళల జట్టు అద్భుత విజయం అందుకుని మిథాలీసేన సెమీఫైనల్‌కు చేరువైంది. టాస్ గెలిచిన మిథాలీరాజ్ బ్యాటింగ్‌ను ఎంచుకుంది. 50 ఓవర్లలో భారత్ 232/8 పరుగులు తీయగా, శ్రీలంక 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 212 పరుగుల చేసింది. ఇప్పటివరకు నాలుగు విజయలక్ష్యాలను ఛేదించి భారత మహిళా క్రికెటర్లు జైత్ర యాత్ర సాగిస్తున్నారు. అయినప్పటికీ పురుష క్రికెటర్లకు వచ్చే గౌరవాభిమానాలు వీరికి దక్కకపోవడం, మీడియా చిన్నచూపు చూడటం శోచనీయం.

## ఇంద్రకీలాద్రిపై శాకాంబరి ఉత్సవాలు ముగింపు



**రా.వా.ప్రతినిధి- విజయవాడ:** తెలంగాణలోని వరంగల్ నగరంలో భద్రకాళి అమ్మవారిని శాకాంబరి దేవిగా ఆషాఢమాసంలో అలంకరించడం భక్తులు దర్శించుకోవడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. అయితే 2007 లో శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ అజాద్ తొలిసారిగా శాకాంబరి ఉత్సవాలను ఇంద్రకీలాద్రిపై ప్రవేశపెట్టి అయిదు రోజుల పాటు నిర్వహించారు. కాలక్రమంలో ఇది మూడు రోజులకు కుదించారు. శాకాంబరీ దేవిగా అమ్మవారు రాక్షసుడిని అంతమొందించారని పురాణాలు చెబుతున్నాయి. శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శాకాంబరి ఉత్సవాలు ఆదివారంతో ముగుస్తాయి. ఇంద్రకీలాద్రి దుర్గమాత గర్భగుడిలోని మూలవిరాటు దుర్గమ్మను వివిధ రకాల కూరగాయలు, ఫలాలతో శాకంబరి దేవిగా అలంకరించారు. వేకువజామున 3 గంటకు అమ్మవారికి సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం ముందుగా సిద్ధం చేసిన కూరగాయలు, ఫలాల దండలను అలంకరించారు. భక్తులను ఉదయం 5 గంటల నుంచి దర్శనానికి అనుమతించారు.

# గోరింటాకు న్యూ డిజైన్స్!

అమ్మాయిలకు గోరింటాకుకు అవినాభావ సంబంధం ఉంది. గోరింటాకు ఎలా పండితే ఎలాంటి భర్త వస్తాడో ఒక సినీ కవి అందంగా పాటకూడా రాశారు. ఆషాడమాసంలో గోరింటాకును పిల్లల నుంచి వృద్ధుల వరకు ఇష్టంగా పెట్టుకుంటారు. ఇది అనాది నుంచీ చూస్తున్నదే. ఇప్పుడు కోన్‌లు కూడా వచ్చాయి. ఎప్పుడూ పాత డిజైన్లే అంటే బోర్ కొట్టేస్తుందికదా అందుకే కొత్త డిజైన్లు ట్రై చేయండి. అలాంటి డిజైన్లే ఇవి.











## సైబర్ యుద్ధాలను వ్యతిరేకిద్దాం : లోకేష్



**రా.వా. అమరావతి :** సైబర్ సెక్యూరిటీ కోసం ఒక సెంటర్‌ను ఏర్పాటు చేయటం ద్వారా వనక్రై వైరస్‌లను అరికట్టవచ్చని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ,పంచాయతీ రాజ్ మంత్రి నారా లోకేష్ తెలిపారు. విద్యార్థుల పాఠ్యాంశాల్లో సైబర్ సెక్యూరిటీ పై అవగాహన, ట్రైనింగ్ ఇవ్వటం అత్యవసరమని సమీక్షా సమావేశంలో ఆయన అన్నారు. దీనిలో భాగంగా అంతర్జాతీయ స్థాయి సైబర్ సెక్యూరిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసి సైబర్ నేరాలను అరికట్ట వచ్చున్నారు. తిరుపతిలో ఎలక్ట్రానిక్ ఉత్పత్తి క్లస్టర్ -2 ను అంతర్జాతీయ ప్రమాణాలతో పూర్తిచేయాలన్నారు. మధురవాడలో ఐటీ సేజ్‌ను, మంగళగిరిలో ఐటి కార్యాలయ భవన్‌ను త్వరలో పూర్తిచేయాలని లోకేష్ ఆదేశించాం.

## వజ్రపథ్‌తో పిడుగు సమాచారం



**రా.వా.ప్రతినిధి,అమరావతి :** పిడుగులు, మెరుపులని ముందుగానే గమనించి ప్రజలను హెచ్చరించటానికి తయారు చేసిన మొబైల్ అప్లికేషన్ వజ్రపథ్‌ను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ప్రజలు వజ్రపత్‌ను తమ మొబైల్ ఫోన్‌లో వాడుకోవచ్చు. ఎరుపు, ఆరెంజ్,పసుపు వర్ణాలతో ఉన్న సర్కిల్స్‌ను ప్రజలకు ఇవ్వటం ద్వారా ప్రజలను పిడుగు సమాచారంపై అప్రమత్తం చేస్తుంది. ఎడమ జోన్ 8 సి.మీ.లలోపు ఉండి డేంజర్ జోన్‌గాను, 8-15. కి.మీలోపు ఉండే ఆరంజ్ జోన్ మెరుపులతోనూ,15-30 కి.మీలలో ఉండే పసుపు జోన్‌లో పిడుగులు వచ్చే అవకాశాలు ఉంటాయి. ఇస్రోతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ద్వారా ప్రజలకు ముందస్తుగానే సమాచారం అందించి విపత్తుల నివారణా చర్యలు తీసుకుంది. విపత్తు సమయంలో బి.ఎస్.ఎన్.ఎల్. ప్రజలకు చరవాణి ద్వారా మెసేజ్‌లను అందించనుంది.

# నియోజకవర్గాల పెంపుపై కేంద్రం ఓకే

రాష్ట్రంలో పెరగనున్న జిల్లాలు



**రా.వా ప్రతినిధి- అమరావతి:** అసెంబ్లీ సీట్ల పెంపు అంశంలో కదలిక ప్రారంభం కావడంతో ఆశావాహుల్లో మరింతగా ఆశలు చిగురిస్తున్నాయి. కేంద్రం విభజనాంశంలోని చట్టాలపై దృష్టి సారించింది. విభజన చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం సీట్లు పెంపునకు కేంద్ర న్యాయ శాఖ పచ్చజెండా ఊపడంతో తెలుగు రాష్ట్రాల్లో ఆయా పార్టీల శ్రేణుల్లో ఉత్సాహం రెట్టింపయింది. అసెంబ్లీ సీట్లు సంఖ్య పెంచాలంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 170(3)కి సవరణ చేయాల్సిందేనని గత అటార్నీ జనరల్ తేల్చి చెప్పారు. ఈ సూచనని అనుసరిస్తూనే 2019 ఎన్నికల నాటికి సీట్లను పెంచేందుకు కేంద్రం సమాయత్త మౌతుంది. ఇటువంటి సవరణలు చేసేటప్పుడు 50 శాతం రాష్ట్రాల అంగీకారం అవసరం. కానీ విభజన చట్టాన్ని అనుసరించే సవరించడంతో పార్లమెంటులో బిల్లు పెట్టి పాస్ చేయించుకోగలిగితే సరిపోతుంది. సీట్ల పెంపు కుదరదని పార్లమెంటు సమావేశంలొ కేంద్రం తెలిపినప్పటికీ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల విజ్ఞప్తి మేరకు దీనిపై దృష్టి సారించారు. విభజన చట్టంలోని సెక్షన్ 26(2) ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియని కేంద్ర ఎన్నికల సంఘమే పూర్తి చేయాల్సి ఉంటుంది. 2003 నియోజకవర్గాల పునర్విభజన చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం ఆయా రాష్ట్రాల ఎన్నికల కమిషనర్లతో పాటు ప్రధాని ఎన్నికల కమిషనర్ సైతం భాగస్వామిగా ఉంటారు. రాజ్యాంగంలోని ఇతర నిబంధనలను అనుసరించే తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో జిల్లాల సంఖ్య పెంచాల్సి ఉంది. పార్లమెంటు నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకునన క్రమంలో రాజ్యాంగంలో అంశాల అమలు కష్టమౌతుందని న్యాయ నిపుణులు అంటున్నారు. అదిగాక పెంచే నియోజకవర్గాలు ప్రస్తుతమున్న ఒక జిల్లా పరిధిలో ఉండాలి తప్ప రెండు జిల్లాల నడుమ ఉండేందుకు వీలు లేదు. ఈ నేపథ్యంలో ఉభయ రాష్ట్రాల్లో జిల్లాను యూనిట్‌గా చేసుకుని విభజన ప్రక్రియ ప్రారంభించాల్సి ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం అసెంబ్లీ స్థానాల విభజన ప్రక్రియ మొత్తం జరిగేలా చూడాల్సిన బాధ్యత అటు కేంద్రంపై ఇటు రాష్ట్రాలపైనా ఉంది.



# చెప్పిందేంటి? చేస్తున్నదేంటి ?

## నాడు ససేమిరా అన్నది నేడు బ్రహ్మాండమైందా ?

వ్యవసాయ ప్రధాన దేశమైన భారత్‌లో స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామని, ఏడాదికి కోటి ఉద్యోగాలు, స్విస్ బ్యాంకుల్లో మూలుగుతున్న 45లక్షల కోట్ల ధనాన్ని 100రోజుల్లో వెనక్కి తెచ్చి ఒక్కొక్కరి ఎకౌంట్‌లో రూ. 15 లక్షలు వేసి, అచ్చేదిన్ తెస్తామని ఎన్నికల ప్రచారం చేసిన మోడీ చేస్తున్నది వేరు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల్లో ఒకటి కూడా అమలు చేయలేదు సరికదా..కనీసం పంటలకు మద్దతు ధర కూడా ప్రకటించడంలేదు. ప్రతి ఏడాది కార్పొరేట్ కంపెనీలకు రూ.5లక్షల కోట్ల రుణాలను మాఫీ చేస్తున్న ప్రభుత్వం రుణాల ఊబిలో చిక్కుకున్న రైతుల ఆత్మహత్యలను పట్టించుకోవడం లేదు.



ఉన్న ఉద్యోగాలను ఊడ బెరికి, పెద్దనోట్ల రద్దు పేరిట ప్రజలందరినీ అనేక ఇబ్బందులు పెట్టిన బీజేపీ ప్రభుత్వం ఈనెల ప్రారంభం నుంచి జీఎస్టీ పేరిట సామాన్యుడిని పీల్చి పిప్పి చేస్తోంది. గుజరాత్ పారిశ్రామికవేత్తలు ఆదాని,అంబానీల అడుగులకు మడుగులొత్తుతూ మధ్యతరగతి వర్గాలకు అవసరమైన అత్యవసర సరుకులపై జీఎస్టీ విధించి, కార్పొరేట్లకు అనుకూలంగా విధివిధానాలను రూపొందించింది.

మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లో జీఎస్టీని తీవ్రంగా వ్యతిరేకిస్తూ రాష్ట్రాలు రూ.14 వేల కోట్లు నష్టపోతాయంటూ ససేమిరా అన్నారు. తాను ప్రధానిగా మారగానే మహత్తరమైన ప్రణాళికగా ఆకాశానికి ఎత్తుతూ తామేదో ప్రజలకు ఒరగబెడుతున్నామనే భ్రమలు కల్పించడానికి ప్రయత్నిస్తున్నారు. నిజానికి ఈ ప్రతిపాదన మొదటిసారి బీజేపీ ప్రభుత్వం వచ్చినప్పుడు తెరపైకి వచ్చింది. 17 ఏళ్ల అనంతరం అనేకమంది కేంద్ర ఆర్థికమంత్రుల చేతుల్లో ఇది మార్పులు చెందుతూ వచ్చిందన్న విషయం మరువరాదు. యూపీఏ ప్రభుత్వంపై జీఎస్టీపై విరుచుకుపడ్డవారంతా ఇప్పుడు ఇది ప్రజలకు సంజీవనిలా పనిచేస్తుందంటూ ఊకదంపుడు ప్రసంగాలు చేస్తూండటం ద్వంద్వ ప్రవృత్తిని బయటపెట్టుకున్నారు.

జూన్1న జీఎస్టీని ఆర్భాటంగా ప్రవేశపెట్టిన కేంద్రంలోని బీజేపీ సర్కారు దాన్ని అమలు చేస్తున్న దేశాలు ఎదుర్కొంటున్న ఒడిదుడుకులు, ఆర్థిక మాంద్యాన్ని గుర్తించకుండా దుందుడుకు నిర్ణయాలు తీసుకుంటూ మధ్యతరగతి వర్గాల నడ్డి విరుస్తోంది. రెండేళ్లలో జరగనున్న ఎన్నికల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నారన్నది స్పష్టం. అంతకుముందు నోట్లరద్దుకూడా ఐదురాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేసిందేనని తెలియంది కాదు. జీఎస్టీకింద 17 రకాల పాతపన్నులను రద్దు చేసి 1500 రకాల శ్లాబులను 4 రకాలుగా విభజించి అదనపు భారాన్ని ప్రజలపై మోపారు.

జీఎస్టీలో మొదట పుట్టింది ఫ్రాన్స్‌లో ఆ తర్వాత కెనాడాలో ఈ రెండు దేశాల్లో ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటనను ప్రభుత్వాలు ఎదుర్కొంటున్నాయి. కెనడా అనేకసార్లు జీఎస్టీ రేట్లు తగ్గించుకోవాల్సి వచ్చింది. ఫ్రాన్స్‌లో 20 శాతం జీఎస్టీని 10 శాతానికి తగ్గించుకుంది. బ్రిటన్ 20 నుంచి 15 శాతానికి తగ్గించుకోవాల్సి వచ్చింది. మలేషియా 6శాతానికి, సింగపూర్‌కు 7 శాతాలకు తగ్గించుకున్నాయి. **జీఎస్టీతో పన్ను ఎగవేత, నేరాలు తగ్గుతాయని కేంద్ర ప్రభుత్వం నమ్మబలకడం కేవలం భ్రమే.. ఫ్రాన్స్‌లో నేరాల సంఖ్య తగ్గలేదుకదా..లీగల్ తగాదాలు పెరిగాయన్నదానిపై భారత ప్రభుత్వానికి అవగాహనలేదు.** జీఎస్టీ అమలు తర్వాత సింగపూర్ జాతీయ ఉత్పత్తుల సూచీ 5.5 నుంచి 3శాతానికి పడిపోయిందని గుర్తించడం లేదు. ఇదంతా ప్రపంచీకరణ ముసుగులో పాలకులు ప్రజావ్యతిరేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని వేరే చెప్పనక్కర్లేదు. ఇందులో భాగంగా ప్రజలపై అధిక పన్నులు వడ్డించి ప్రభుత్వరంగ సంస్థలను దివాళా తీయిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం వృద్ధిరేటు 1.5 శాతం పెరుగుతుందని దబాయిస్తోంది. దీనిపై ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త ,నీతి అయోగ్ సభ్యుడు వివేక్ దేబ్రాయ్ మాట్లాడుతూ వృద్ధిరేటు అసాధ్యమని 13వ ఆర్థికసంఘం ఆదర్శవంతమైన జీడీపీకి దగ్గర్లో కూడాలేదని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచంలో 160 దేశాల్లో జీఎస్టీ లేదని వాటిల్లో ఉంది వ్యాట్ మాత్రమేనని ఆయన వెల్లడించారు. జీఎస్టీతో రాష్ట్రంలోని 100కు పైగా దేవాలయాలు 18 శాతం పన్ను చెల్లించాల్సి ఉంది. జీఎస్టీతో అపార్టుమెంటుల కొనుగోళ్లు భారం పెరుగుతోంది. ఇప్పటివరకు వ్యాట్, సేవల పన్ను 5.75 శాతం ఉండగా, జీఎస్టీతో 12 శాతానికి పెరిగింది. దీంతో రూ. 25 లక్షలు చేసే అపార్టుమెంటు ధరకు మరో లక్షన్నర ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది. అయితే జీఎస్టీ భారం పెరగకుండాఉండటానికి ఇన్‌పుట్ సబ్సిడీని కేంద్రం ప్రకటించినప్పటికీ అది జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత నిర్మించిన అపార్టుమెంటులకే వర్తిస్తుంది.

**అవాక్కైన విలేకరులు**

అనేక అపోహలు,సమస్యలతో సతమతమవుతున్న ప్రజలకు సందేహ నివృత్తి చేస్తూ జీఎస్టీ అధికారులు బిజీబిజీగా ఉంటారని ఊహిస్తూ వెళ్లిన విలేకరులు అవాక్కయ్యారు. కారణం ఆఫీసంతా ఖాళీగా... సిబ్బంది ఎవరూ లేకుండా పోవడమే

**జీఎస్టీతో ఇడ్లీకొనడం కష్టమే : శోభాడే**

జీఎస్టీ అమలైనతర్వాత ఇడ్లీ కూడా కొనలేకపోతున్నామని ప్రముఖ జర్నలిస్టు శోభాడే తెలిపారు. ఆమె ఆర్డర్ఇచ్చిన పొంగలి, ఇడ్లీ, కాఫీకి రూ. 88.50 బిల్లయ్యిందని , జీఎస్టీ దుష్ప్రభావాలు పేరుతో ఆమె ట్విటర్‌లో పోస్టు చేశారు.

**మోడీ సొంతరాష్ట్రంలో జీఎస్టీపై నిరసనగళం**

ఎన్నడూలేని విధంగా వస్త్రాలపై జీఎస్టీని విధించడంపై అన్ని రాష్ట్రాలతోపాటు గుజరాత్‌లో కూడా వ్యాపారులు నిరసన ఆందోళనలు చేపట్టారు. సూరత్‌లో ఈ ఆందోళనను చేపట్టిన వ్యాపారులపై పోలీసులు లాఠీలు ఝుళిపించారు. ఈఘటనలో అనేక మంది గాయపడ్డారు. దీంతో అన్ని వర్గాల నుంచి అసమ్మతి పెరిగింది. ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ మాట్రాడుతూ వినియోగదారులు చెల్లించే పన్నుకోసం వ్యాపారులు ఆందోళనలు చేపట్టడమేమిటని ప్రశ్నించడం ప్రజలను ఆగ్రహానికి గురిచేసింది. పాలకులు ప్రజల వ్యధలను అర్థం చేసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ నేపథ్యలో చాలా అనేక వర్గాలకు చెందిన వ్యాపారులు తమ పేర్లను జీఎస్టీలో నమోదు చేసుకోలేదు. హెూటళ్లలో జీఎస్టీ కట్టకూడదంటే తప్పకుండా ఇంట్లో వంట చేసుకోవాలని మంత్రి నిర్మలాసీతారామన్ ప్రజలను కోరడం వివాదాస్పదమవుతోంది. మే 2017లో ఏం తినాలో బీజేపీ ప్రభుత్వం ఏం తినాలో నిర్ణయిస్తేజూన్ 2017లో ఎక్కడ తినాలో కూడా నిర్దేశిస్తుందని నెటిజన్లు విరుచుకు పడుతున్నారు.

మందుల విషయంలో మాత్రం కేంద్రం కొంచెం సమయం ఇచ్చింది. ఆగస్టు 1 నుంచి జీఎస్టీని అమలు చేయనున్నారు. అంతవరకు పాతరేట్లతోనే అమ్మకాలు జరుపుతారని ఫార్మస్యూటికల్ పరిశ్రమలు తెలిపాయి. జీఎస్టీ అమలుతో ఇన్సులిన్, కిడ్నీ, కేన్సర్ సంబంధించి ధరలు తగ్గాల్సి ఉండగా వాటిని అమలు చేయడానికి మరో రెండు నెలలు సమయం పడుతుందని యంత్రాగం తెలిపింది.

**రైతు నెత్తిన పిడుగు**

వస్తుసేవాపన్నుల విధానంతో వ్యవసాయ వినియోగ సరకులపై 5 నుంచి 28 శాతం వరకు పన్ను విధించడంతో వ్యవసాయం తీవ్ర నష్టాలను ఎదుర్కోనుంది. జీఎస్టీకి ముందు డీఏపీ రూ.335 ఉంటే దానిపై పన్ను విధింపు ద్వారా మరింత ప్రియంగా మారింది. ఇప్పటికే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రకృతి, దళారుల నుంచి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నరైతన్నకు మూలిగే నక్కపై తాటిపండు పడిన విధంగా జీఎస్టీ విధించారు.

## టాటా కార్లూ చౌకే..!





**ముంబై :** జీఎస్టీ ప్రభావంతో వాహన ఉత్పత్తి సంస్థల డిస్కౌంట్ ఊరింతలు అన్ని ఇన్నీ కావు. జీఎస్టీ రాయితీని వినియోగదారుడికి దక్కే విధంగా ధరలను కారుచౌకగా నేలకు దించేస్తున్నాయి. తాజాగా టాటా మోటార్స్ కూడా ఇదే వాణిని వినిపిస్తోంది. ప్యాసింజర్ వాహనాల ధరలపై రూ.3,300-2.17 లక్షల మేర తగ్గించింది. జీఎస్టీతో దేశవ్యాప్తంగా ఏకీకృత పన్ను విధానం అమల్లోకి తేనున్న నేపథ్యంలో మోడల్, వేరియంట్ పై ఆధారపడి12 శాతం వరకు తగ్గింపు ధరలను ఆఫర్ చేస్తున్నట్టు టాటా మోటార్స్ ప్రెసిడెంట్,(ప్యాసింజర్ వెహికల్స్ బిజినెస్ యూనిట్) మయాంక్ పార్థ్ తెలిపారు. రూ.3,300 ల నుంచి రూ.2,17,000 వరకు ధర తగ్గింపు ఉండనుందని తెలిపారు. కాగా మహీంద్రా అండ్ మహీంద్రా వినియోగ వాహనాలు, ఎస్‌యూవీల ధరలను సగటున 6.9 శాతం తగ్గించింది. అదేవిధంగా, కంపెనీ చిన్న వాణిజ్య వాహనాల ధరలను కూడా తగ్గించింది. జీఎస్టీ అనంతరం హోండా కార్స్ ఇండియా,ఫోర్డ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్,ద్విచక్ర వాహనాల ఉత్పత్తిదారులు టీవీఎస్ మోటార్ కంపెనీ లిమిటెడ్, హోండా మోటార్సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎమ్ఎస్ఐ), సుజుకి మోటార్సైకిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్,కంపెనీలు ధరలను తగ్గించిన విషయం విధితమే.

## జీఎస్టీ పాప



జూన్ 30 రాత్రి 12 గంటలకు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ వస్తు,సేవలబిల్లును (జీఎస్టీ) ఆర్భాటంగా పారంభించారు. ఇదొక మరపురాని రోజుగా, దేశ అభ్యున్నతికి చిహ్నంగా భావించిన దంపతులు ఆదే సమయాన పుట్టిన తమ పాపకు జీఎస్‌టీ అని పేరు పెట్టుకున్నారు. చత్తీస్‌ఘడ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ పాప పుట్టింది. జీఎస్టీ అని పెట్టడంతో గ్రామస్తులు పాపను చూడటానికి క్యూ కట్టారు.

## జీఎస్టీతో ఏడుకొండల వాడికీ సెగ

వస్తుసేవల పన్ను భారం తిరుమలేషుని కూడా కుదిపేస్తోంది. ఆలయంలో ధర్మదర్శనం, దివ్యదర్శనం ప్రత్యేక దర్శనం పేరుతో మూడురకాలైన దర్శనాలు టీటీడీ అందుబాటులోకి తెచ్చింది. కాలినడకన వచ్చే భక్తులకు దివ్యదర్శనంపేరుతో టోకెన్లను ఇచ్చి, ఒక లడ్డూను ఉచితంగా అందించి మరో రెండు లడ్డూలను ఒక్కొక్కటి రూ. 10లకు అందచేస్తున్నారు. ఉచిత దర్శనానికి కూడా ఇదే ధరకు లడ్డూలు విక్రయిస్తారు. కేవలం ఈ లడ్డూలవల్లే ఏడాదికి రూ. 80 కోట్లు ఖర్చవుతుందని పాలక వర్గం చెబుతోంది. ప్రస్తుతం దర్శన టికెట్లు, ఆర్జితసేవలు, అద్దెగదులు, తలనీలాల అమ్మకాలపై జీఎస్టీ విధించడంతో మరో రూ. 75కోట్లు అదనపు భారంపడుతుందని టీటీడీ పేర్కొంది. అలాగే లడ్డూ ప్రసాదం తయారీలో ఉపయోగించే నెయ్యి,పంచదారపై కూడా జీఎస్టీ పన్ను భారం పెరగనుంది. ప్రస్తుతం ఒక్కోలడ్డూకు రూ. 35 ఖర్చుఅవుతుండగా, భక్తులకు కేవలం 25 రూపాయలకే అందిస్తుంది. దీంతో మరో రూ.50 కోట్ల భారం పెరుగుతుందని ఆయా వర్గాలు పేర్కొంటున్నాయి. దీనిని నివారించేందుకు దివ్యదర్శనాన్ని శుక్ర,శని, ఆదివారాల్లో రద్దు చేస్తూ ఆలయ కమిటీ నిర్ణయం తీసుకొంది. ఇప్పటికే వేసవి సెలవులు పేరుతో 50 రూపాయల సుదర్శనం టోకెన్లకు మంగళంపాడింది. సాధారణ రోజుల్లో స్వామివారి దర్శనం కోసం 40 వేల మంది, వారాంతాల్లో 60 వేల మంది వస్తారని దేవాలయ వర్గాలు చెబుతున్నారు. ఉచితలడ్డూకు మంగళం పాడుతూ ఈనెల 7నుంచి అమలు చేయనుంది. దీంతో సామాన్యుడికి దేవుడి దర్శనం గగనమైపోతోంది. వీఐపీ టికెట్ల ధరలుపెంచడం, ఆర్జిత సేవలు, అతిథి గృహాల అద్దెల పెంపుతో జీఎస్టీ భారాన్ని తొలగించకుండా భక్తుల మనోభావలను దెబ్బతీస్తున్నారని సామాన్యుడు గొల్లుమంటున్నాడు.



## ప్రతిష్టను కాపాడుతా : కోవిందు



అధికారపార్టీ అభ్యర్థి రామ్‌నాథ్ కోవిందు తెలుగురాష్ట్రాలను సందర్శించిన సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రపతి ప్రతిష్టను కాపాడుతానని వాగ్దానం చేశారు. రాజ్యాంగం భగవద్గీత, ఖురాన్, బైబుళ్లతో సమానమన్నారు అయితే గతంలో క్రైస్తవులు, ముస్లింలు ఈ దేశానికి చెందరని ఆయన ప్రకటించిన పోస్టు సోషల్ మీడియాలో హల్‌చెల్ చేస్తోంది. అంతేకాదు..కులాలు మతాలపేరిట విభజనవాదం, విద్వేశాలను రెచ్చగొట్టడం చట్టంలోని ఆర్టికల్ 153 ఏ, 153 బి ప్రకారం శిక్షార్హుడని రాష్ట్రపతి అభ్యర్థిగా ఆయనకు అర్హత లేదని దానిలో పేర్కొన్నారు. నిజానికి అంతకుముందు రాష్ట్రపతులకున్న ఛరిష్మా కోవిందుకు లేదు. అనేక రాజకీయపదవులను అనుభవించి, లౌకిక,ప్రజాస్వామ్య ప్రక్రియకు తమ వంతు సాయం అందించినవారే రాష్ట్రపతులుగా పనిచేశారు. కోవిందు ఆర్‌ఎస్‌ఎస్ అనే ఒక మతతత్వ పార్టీ నుంచి వచ్చారు. ఆయన చిన్నతనం నుంచి దానిలో కొనసాగుతున్నందున ఆయా భావజాలాలే ఉంటాయని దేశ ప్రజలు నమ్ముతున్నారు. ఈ సమయంలో ఆయన పై ప్రకటన చేయడం ఆశా జనకంగా ఉంది. కుల, మత, ప్రాంత సమస్యలు లేకుండా దేశంలోని 125 కోట్ల మందికి భరోసా నిస్తూ ప్రజాస్వామ్య లౌకిక వాదానికి ప్రాణప్రతిష్ట చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. రాష్ట్రపతి లాంటి అత్యున్నత పదవికి పోటీ ఉండకూడదని అభ్యర్థి ఎవరో తెలియక ముందే బీజేపీ అభ్యర్థికి నా మద్దతు అంటూ ప్రతిపక్షనాయకుడు జగన్ ప్రకటించడం ఖచ్చితంగా సరైన నిర్ణయం కానప్పటికీ తన మీద ఉన్న కేసులే ఆవిధంగా మాట్లాడించాయని చెప్పక తప్పదు. అదే సమయంలో ఎంతో పుష్పగుత్తిని అందించి పాదాభివందనాలు చేయడం కేసుల్లో ఆయన ఎంతగా నలిగి పోతున్నారో అర్థం అవుతుంది. కాంగ్రెస్ ఆయనపై ఉద్దేశ్యపూర్వకంగా కేసులు పెట్టిందని నమ్ముతున్నారు కాబట్టి, ఎలాగూ మీరాకుమార్‌కు ఓటు వేయరు. దీంతో ఆయన బీజేపీ అభ్యర్థికి మద్దతు ముందుగానే తెలియచేశారని అనుకోవచ్చు.

ఎలాగో విజయం వరించే అభ్యర్థి కోవిందే కాబట్టి ఇకనైనా అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి ప్రథమ పౌరుడిగా ఆయన ప్రజలందరి పట్ల సమ దృష్టి కలిగి, ప్రాథమిక హక్కుల పరిరక్షణకు కృషిచేస్తూ, లౌకికతత్వానికి కట్టుబడి ఉండాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

## సైద్ధాంతిక పోరాటం : మీరా కుమార్



మీరాకుమార్ ఆంధ్రప్రదేశ్‌కు రాలేకపోయారు. దానికికారణం అందరికీ తెలిసిందే.. ఆంధ్రప్రదేశ్‌లోని పన్నులు, ఇతర ఆదాయాల ద్వారా వచ్చిందంతా హైదరాబాద్ అభివృద్ధికే వెచ్చించామని, రాజధాని లేకుండా ఆంధ్రప్రదేశ్‌ను విభజించవద్దని ఎంతగా వేడుకున్నప్పటికీ సోనియా ఆదేశాలకు తలొగ్గి పార్లమెంటు స్పీకర్‌గా తలుపులు మూసి, మీడియాను అనుమతించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తూ రాష్ట్ర విభజనకు పాల్పడినందున ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించలేకపోయారు. అందుకే అంటారు "ధర్మాన్ని నువ్వుకాపాడితే ధర్మం నిన్ను కాపాడుతుందని"..అంతగా బరితెగించి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చినా కేసీఆర్ ఈరోజు కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. రాష్ట్రం ఏర్పాటుచేస్తే పార్టీని కాంగ్రెస్‌లో కలితంతపేస్తానన్న కేసీఆర్ సోనియాగాంధీకి ఝులక్ ఇచ్చారు. నమ్మి ఓట్లేసిన వారిని నట్టేట ముంచేవారు వారితీసిన గోతిలో వారే పడతారని ఈ ఘటన రుజువు చేస్తూ, భారతదేశ చరిత్రలో నిలిచిపోయే సందేశం ఇచ్చింది.

తమిళనాడులో డీఎంకే మీరాకుమార్‌కు మద్దతు ఇచ్చింది. అధికార పార్టీలోని అన్ని వర్గాలు కోవింద్‌కే మద్దతు తెలిపాయి. కర్ణాటకలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాగూ మీరాకుమార్‌కే మద్దతు, కేరళాలో సీపీఎం అధికారంలో ఉంది అది కూడా ఆమెకే మద్దతు తెలుపుతుంది. అయితే అనేక రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉంది కనుక దానికే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే ఆమె ఆత్మప్రభోధాన్ని అనుసరించి ఓట్లు వేయండని అడుగుతున్నారు. అంటే అధికార బీజేపీ సభ్యులు కూడా తనకే ఓటు వేయాలని అడగడం.. నిజానికి ఈ వాదనను ఇందిరాగాంధీ వీవీగిరి స్వతంత్ర రాష్ట్రపతి అభ్యర్థిగా ఉన్నప్పుడు ఈ ఆత్మప్రభోధం వ్యాఖ్యాన్ని ముందుకు తెచ్చి ఆయనను గెలిపించారు. ఆసమయంలో నేషనల్ కాంగ్రెస్ తరుపున నీలం సంజీవరెడ్డి ఉన్నారు. ఇదే ప్రక్రియను ఇన్నాళ్ల తర్వాత మీరాకుమార్ మళ్లీ మనముందుకు తెచ్చారు. నిజానికి కోవింద్‌కంటే మీరాకుమార్‌కే రాష్ట్రపతి అయ్యే అర్హతలు ఎక్కువగా ఉన్నప్పటికీ మన్‌మోహన్‌సింగ్, మీరాకుమార్ వ్యక్తిత్వాలను సోనియాగాంధీ బలితీసుకున్నారని చెప్పక తప్పదు. లేదంటే ఆమె మచ్చలేని వ్యక్తిగా మిగిలి ఉండేవారు. ప్రస్తుతం ముస్లిం ఓట్లను కూడా అడగలేని స్థితిలో మీరాకుమార్ ఉన్నారు. నిజానికి నెహ్రూ, గాంధీ హయాంల్లో దళిత, మైనార్టీ వర్గాలన్నీ కాంగ్రెస్ ఓట్ల బ్యాంకుగా ఉండేవి. యూపీఏ 2 పాలనలో ఎంఐఎం పార్టీ చెందిన అక్బరుద్దీన్, అసదుద్దీన్‌లను పాత కేసులను తిరగదోడించి నాన్‌బెయిల్‌బుల్ వారెంట్‌తో అరెస్టు చేయించడంతో మొదటిసారి కాంగ్రెస్ ముస్లింల విశ్వాసాన్ని కోల్పోయింది. దీంతో హైదరాబాద్‌లో వారి ఓట్లను అభ్యర్థించకుండానే మీరాకుమార్ వెనుతిరిగారు.

### నియంత్రణ, నిఘా వ్యవస్థలు ఏవీ!?

ధరలపై వ్యాట్ ప్రభావాన్ని పర్యవేక్షించేందుకు పక్కా యంత్రాంగంలేకపోవడం, పన్నుల తగ్గింపు ప్రయోజనాన్ని కంపెనీలు విధిగా వినియోగదారులకు చేరవేసేలా చర్యలు తీసుకోకపోవడం ఇందుకు కారణం. పైగా కొన్ని సరుకుల ధరలు అసాధారణంగా పెరిగాయి.

### జీఎస్టీలో ఏం జరగనుంది!?

జీఎస్టీ కారణంగా పన్నులు తగ్గే వస్తువుల ధరలను వ్యాపార సంస్థలు తగ్గించి తీరాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తోంది. లేదంటే, 'యాంటీ ప్రాఫిటీరింగ్' క్లాజ్ కింద కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తోంది. ఈ ప్రత్యేక క్లాజ్‌ను జీఎస్టీ చట్టంలో భాగంగా ముందుకు తెచ్చింది. ఇందుకు 'నేషనల్ యాంటీ ప్రాఫిటీరింగ్ అథారిటీ' (ఎన్ఏపీఏ) పేరుతో ఒక సాధికార సంస్థను ఏర్పాటు చేస్తుంది. ఈ క్లాజ్ ప్రకారం, ఎన్ఏపీఏతోపాటు మరో రెండు వ్యవస్థలు కూడా ఉంటాయి. వాటిలో మొదటిది తొమ్మిది మంది సభ్యుల జీఎస్టీ స్టాండింగ్ కమిటీ. రెండోది, డైరెక్టర్ జనరల్ ఆఫ్ సేఫ్‌గార్డ్స్. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వస్తే, వాటిని స్టాండింగ్ కమిటీ పరిశీలించి దర్యాప్తు కోసం డైరెక్టర్ జనరల్ ఆఫ్ సేఫ్‌గార్డ్స్‌కు పంపిస్తుంది. డీజీఎస్ దర్యాప్తు చేసి నివేదికను ఎన్ఏపీఏకు అందజేస్తారు. ఎన్ఏపీఏ తుది చర్యలు తీసుకుంటుంది. మొత్తం ప్రక్రియకు నిబంధనల ప్రకారమే 9 నెలలు పడుతుంది. అయితే, కేవలం చట్టాలతో పనులు కావన్నది ఏళ్లుగా చూస్తున్న అనుభవం.

### ముందు జాగ్రత్త ఏదీ?

ధరల విషయంలో వ్యాపార, ఉత్పత్తి సంస్థలు అడ్డగోలుగా వ్యవహరించకుండా జీఎస్టీ అమలుకు ముందే తగిన చర్యలు తీసుకోవాల్సి ఉన్నా, ప్రభుత్వం వాటిపై దృష్టి పెట్టలేదు. ఆస్ట్రేలియా 2000లో జీఎస్టీని అమల్లోకి తెచ్చింది. 1999 నుంచి 2002 వరకూ పరివర్తన కాలంగా ప్రకటించి పక్కాగా పలు చర్యలు తీసుకుంది. దేశవ్యాప్తంగా హాట్‌లైన్ వ్యవస్థ ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరించింది. జీఎస్టీతో ధరల్లో వచ్చే మార్పుల వివరాలను వినియోగదారులకు తెలిపేందుకు హాట్‌లైన్‌నే వేదిక చేసుకుంది. జీఎస్టీకి ముందు, ఆ తర్వాత ధరలపై సమగ్ర సర్వే చేసి డేటా సిద్ధం చేసింది. జీఎస్టీ అమలుకు ముందు మార్కెట్లోకి విడుదల చేసిన స్టాక్‌పై 'జీఎస్టీకి ముందు' అని ముద్రించాలని ఆదేశించింది. భారత్‌లో ఇలాంటి చర్యలు ఏమీ తీసుకోలేదు.

### ఫుడ్ ప్రాసెసింగ్ శాఖలో జీఎస్టీ సెల్

పారిశ్రామికవేత్తల్లో, వ్యాపారుల్లో, వినియోగదారుల్లో చైతన్యం కలిగించేందుకు కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రిత్వశాఖ జీఎస్టీ సహాయక సెల్‌ను నెలకొల్పింది. పరిశ్రమలకు అవగాహన కల్పించేందుకు మంత్రిత్వశాఖ పలు కార్యక్రమాలు, సెమినార్లు నిర్వహించనున్నది. ఈ సెల్‌లో నలుగురు సభ్యులు పని చేస్తారు.నాయుడు చెప్పారు. ఈ వేడుకలో నాన్-ఎన్డీయే పార్టీలు అన్నాడీఎంకే, జేడీయూ, బీజేడీ, టీఆర్ఎస్, వైఎస్సార్ కాంగ్రెస్, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ లు హాజరవుతున్నాయి.

### జీఎస్టీపై 55 శాతం ప్రజలకు అవగాహన లేదు

దేశంలో సగానికిపైగా ప్రజలకు తాజాగా కేంద్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న జీఎస్టీ (వస్తు- సేవల పన్ను) గురించి అవగాహన లేదని వేఈ ఆన్‌లైన్ అనే మొబైల్ న్యూస్ అప్లికేషన్ కంపెనీ జూన్ 26-30 వరకు తాజాగా చేపట్టిన సర్వేలో వెల్లడైంది. 64 శాతం మంది ప్రజలకు దీన్ని గురించి తెలుసుకోవలసిని అవసరం ఉందని తెలిపారు. సుమారు 45 శాతం మందికి ఈ నూతన పన్ను విధానం గురించి అతి తక్కువగా తెలుసునని మిగిలిన 55 శాతం మందికి అసలు జీఎస్టీ అంటే ఏమిటో కూడా తెలియదన్నారు. జీఎస్టీ ప్రభావం పట్టణప్రజల్లో తీవ్ర అనిశ్చితి పరిస్థితిని రేకెత్తించినట్లు తెలుస్తోంది.

### జమ్మూ కాశ్మీరులో సరుకుల కొరత

జమ్మూకాశ్మీరులోని అత్యవసర సరుకులు మరో ఒకట్రెండు రోజుల్లో అయిపోయే పరిస్థితులు కనబడుతున్నాయి. పారిశ్రామిక యూనిట్లు తమ ఉత్పత్తిని నిలిపి వేయడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. బిల్లు, పంపిణీ విధానంలో జీఎస్టీని మలు చేయకపోవడంతో ఇలాంటి పరిస్థితి వచ్చిందని జమ్మూకాశ్మీరులోని ట్రేడర్స్ ఫెడరేషన్ చాంబర్ అధ్యక్షుడు నీరజ్ ఆనంద్ తెలిపారు. జూలై 1కి ముందు సుమారు రోజుకు 2 వేల దాకా వచ్చే సరకుల వాహనాల సంఖ్య 200-300కు పడిపోయిందన్నారు.'దాదాపుగా జమ్మూలోని పారిశ్రామిక ఉత్పత్తుల కంపెనీలు పడకేసాయి. జమ్మూ కాశ్మీరు ప్రభుత్వం జీఎస్టీని అమలు చేయడంలో విఫలమవడంతో ప్రస్తుతం ఉత్పత్తి జరగడం లేదు ', అని బారి బ్రహ్మన ఇండస్ట్రీస్ అసోసియేషన్ సభ్యుడు అనిల్ సూరి తెలిపారు. దాదాపుగా 5 వేల పారిశ్రామిక యూనిట్లను జీఎస్టీ దెబ్బ కొట్టిందని ఆయనన్నారు.

# జాతిని ఏకం చేసిన టిటూ మీర్

**సయ్యద్ మీర్ నిసార్ అలీ (1785 -1832)**



భారతావనిలో వలసవాదుల పాలన ప్రారంభమైన నాటి నుండి బ్రిటిష్ శక్తులకు వ్యతిరేకంగా పలు తిరుగుబాట్లు జరిగాయి. ఈ పోరాటాల చరిత్రలో ప్రత్యేక స్థానం పొందిన వహాబి ఉద్యమానికి సమరశీలత జోడించి,చివరకు స్వాతంత్ర్య సమరంలో భాగంగా సాగిన పలు పోరాటాలకు ప్రేరణగా నిలచిన కార్యశూరులు 'టిటూ మీర్' గా సుప్రసిద్ధులైన సయ్యద్ మీర్ నిసార్ అలీ. ఆయన పశ్చిమ బెంగాల్‌లోని నర్కేల్‌బరియా పరగణా హైదరాపూర్ గ్రామంలో 1782లో జన్మించారు. తల్లి అబిదా రుఖియా ఖాతూన్. తండ్రి సయ్యద్ మీర్ హసన్‌అలీ. సన్నకారు రైతు కుటుంబం. చిన్నతనంలో వస్తాదుగా పేర్గాంచిన నిసార్ అలీ పలు చిన్న చిన్న ఉద్యోగాలు చేశారు. 1823లో మీర్ నిసార్ అలీ మక్కాను సందర్శించారు. ఆ సందర్భంగా ఇండియాలో వహాబి ఉద్యమ వ్యవస్థాపకులు సయ్యద్ అహమ్మద్ బరేల్వీని,ఫరాజి ఉద్యమ నిర్మాత హాజీ షరియతుల్లాను ఆయన కలిశారు. ఈ ముగ్గురు నాయకుల కలయిక బ్రిటిషర్లకు వ్యతిరేకంగా 'వహిబీ-ఫరాజీ' ఉద్యమ స్రవంతులు పోరుబాటన ఉధృతంగా సాగటానికి ఉపయోగపడింది. మీర్ నిసార్ అలీ మక్కా నుండి తిరగి వచ్చాక నర్కేల్‌బరియా దగ్గర గల హైదర్‌పూరులో స్థిరనివాసం ఏర్పాటు చేసుకుని, ధార్మిక ౘారం కోసం పర్యటనలు సాగించారు. ఆ సందర్భంగా ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారులు,జమీందారులు- మహాజనులు ప్రజల మీద సాగిస్తున్న అకృత్యాలను, దోపిడీని ప్రత్యక్షంగా చూశారు. ప్రజల ఆక్రందనలు విన్నారు. ఆ బాధిత ప్రజల సమస్యల పరిష్కారం కోసం, దోపిడి శక్తుల అట కట్టించేందుకు ఆయన నిర్ణయించుకున్నారు. ఇస్లాం సంబంధించిన శుద్ధ ధార్మిక ప్రచార కార్యక్రమాలతో పాటు ప్రాపంచిక సమస్యల పరిష్కారం కోసం ఆయన ప్రయత్నాలు ఆరంభించారు. స్వజనుల మీద పరా పాలకుల పెత్తనాన్ని తుడిచి పెట్టేందుకు ఆయన నడుంకట్టారు. ఆ దిశగా ఉద్యమించిన టిటూమీర్ కంపెనీ పాలకులు, జమీందారుల దౌర్జన్యాల మీద ధ్వజమెత్తారు. జమీందాలరులకు మద్దతుగా నిలుస్తున్న ఆంగ్లేయులను కంపెనీ పోలీసు- సైనిక బలగాలను సాయుధంగా ఎదుర్కొన్నారు. స్వయంగా పలు పోరాటాలకు నాయకత్వం వహించారు. ప్రభుత్వ కచ్చేరీల మీద,'గడ్డం పన్ను' విధించి ముస్లింలను వేధించిన జమీందారుల ప్రాసాదాల మీద పలు దాడులు జరిపారు. అధికారులకు తమ దాడుల సమాచారం ముందుగా తెలిపి ప్రజాబలంతో ఆయన దాడులు నిర్వహించారు. టిటూమీర్ సాహసోపేత చర్యల మూలంగా అన్ని మతాల, వర్గాల పేద ప్రజానీకం వేల సంఖ్యలో ఆయన వెంట నడిచారు. ఆ క్రమంలో నర్కేల్‌బరియాలో వెదురు కర్రలతో నిర్మించిన కట్టుదిట్టమైన కోటలో సహచరులకు సాయుధ శిక్షణ కల్పించించారు. సుమారు దశాబ్ధం పాటు కంపెనీ పాలకులను ఆయన ఖంగుతిన్పించారు. చివరకు 1831 నవంబర్ 19న కంపెనీ సైన్యాధికారులు భారీ బలగాలలో సర్కేల్‌బరియాలోని కోటను ముట్టడించగా శత్రువుతో పోరాడుతూ గాయపడి కుప్పకూలిన సయ్యద్ మీర్ నిసార్ అలీ చికిత్స పొందుతూ 1832లో కన్నుమూశారు.

**(ముస్లిం స్వాతంత్ర్య సమరయోధులు ఆల్బమ్ 'చరితార్థులు' నుంచి....)**




**Syed Naseer Ahamed**

Mobile: 9440241727.

E-mail: naseerahamedsyed@gmail.com


## ఎన్నికల్లో సంస్కరణల కోసం

# 'జనవాహిని'లో చర్చిద్దాం

మనదేశంలో ఎన్నికలంటే బలవంతుడు బలహీనులపైన దాడి మాత్రమే. " సాంప్రదాయ పెట్టుబడి రాజకీయపార్టీలు" సామాజికన్యాయం గురించి, శ్రేయోరాజ్యం గురించి ప్రవచనాలు మాత్రమే చెబుతాయి. రాజ్యాధికారం విషయంలో మాత్రం బంధుప్రీతి,డబ్బు, కండబలం మొదలైనవి మాత్రమే చూస్తాయి. పార్టి ఫిరాయింపును కూడా నిరోధించడానికి సరియైన చట్టసవరణలు రాలేదు. నేరచరితులు, నేరస్తులు చట్టసభలలో ఉంటే వాళ్ళ చేసే చట్టాలు సామాన్యులకు ఎంతవరకు ఉపయోగపడతాయి? ఈవిషయాలు మనకు తెలియనివి కావు. కానీ నా ఒక్కడి వలనే ఏమవు తుంది? నేనే ఎందుకు మొదలుపెట్టాలి అనే ప్రశ్నల వద్ద ఆగిపోతాము. లేదా మనం స్వయంగా చేసే పరిస్థితి లేకపోయినాచేసేవాళ్ళని చూసి సహించలేక అనవసర ఆరోపణలు చేస్తాము. ఈవిధంగా 70 ఏళ్ల స్వాతంత్ర్య ప్రజాస్వామ్యం కొట్టుమిట్టాడుతోంది. సమస్త అవినీతికి మూలకారణం ఓట్లు అమ్మడం, కొనడం వద్దే మొదలవుతోంది. ఇటీవల ఒక ప్రముఖ రాజకీయవేత్త తన శాసన సభ నియోజకవర్గానికి 8 కోట్లకు పైగా ఖర్చు అయిందంటే అదే జిల్లాకు చెందిన మరోక ప్రముఖుడు మేము డబ్బులు పెట్టి ఓట్లుకొం టున్నాం.. మీకు ఎందుకు పనులు చెయ్యాలి అన్నారంటే పరిస్థితి తీవ్రతను మనం గుర్తించాలి. దీనికి మనం ఏమి చెయ్యాలి? కేవలం ఎన్నికలప్పుడు మాత్రమేచర్చించితే సరిపోతుందా? ఎన్నికల సంఘంఏమి చెయ్యొచ్చు? అనేది ఆలోంచించాలి. పోస్టాఫీసులా ఎన్నికలు ఒక ప్రహసనంలా నిర్వహించి ఎన్నికల సంఘం చేతులు దులుపుకుంటున్నారు. మన పొరుగు దేశాలలోఓట్లు వేయకపోతే అట్టి పౌరులపై కఠినచర్యలుంటాయి. నీరు, విద్యుత్ సరఫరా నిలివేత మొదలయినవి. ఇప్పటికి 50 నుండి 55 శాతం పోలింగ్ జరుగుతున్న మనదేశంలో అట్టి చట్టసవరణలు అత్యవసరం. తరువాత మరీ ముఖ్యమైనది ఎన్నికల సంవత్సరంలో ఊరేగింపులు, బహిరంగసభలు, టివి, పత్రికామాధ్యమాలద్వారాప్రచారం. పొరుగు దేశాలలో ప్రధానమంత్రి అభ్యర్థులు అధ్యక్ష అభ్యర్థులు చిన్నచిన్న కరపత్రాలతో బస్ స్టాండ్లలో రైల్వే స్టేషన్ లలో ప్రచారాలు చేస్తోంటే మనవాళ్ళు నేటికి కోట్లు ఖర్చుపెట్టి ప్రజలకు డబ్బులిచ్చి, మద్యం సరఫరా చేసి, ప్రజలను రవాణా చేసిసభలు నిర్వహిస్తుంటే ఎప్పటికి ఈభారతం మారేది? సామాన్యుడు ఎన్నడు రాజకీయప్రవేశంచేసేది? ఎన్నికల సంవత్సరంలో ప్రచారం అంతా ఎన్నికలసంఘం ఆధ్వర్యంలో నిర్వహించేలా సవరణలు తేవాలి.సోషల్ మీడియాను నీతివంత మయిన రాజకీయాలు కావాలనుకొనే ఔత్సాహిక రాజకీయనాయకులు విరివిగా ఉపయోగించుకోవాలి. వీటన్నిటికంటే మనలను ఇబ్బంది పెట్టేది మనకు తగు ప్రాతినిధ్యం దొరకడంలేదు సామాజిక న్యాయం లేదనేవిషయం మనమందరము గత 40 ఏళ్లుగా చర్చోపచర్చలు జరుపుతున్నాము.ఇక పుత్రోత్సాహం గురించి చెప్పనక్కరలేదు. మరి మనమేంచేయాలి? లెక్కకు మించి ఉన్న సంక్షేమసంఘాలు సిద్ధాంత రాద్ధాం తాలకు మాత్రమే పరిమితమైతే బరిలో దిగి యుద్ధం చేసేదెన్నడు? నాదొక చిన్న విన్నపం. దయచేసి పట్టణాలలో నగరాలలో ఉన్న ఒచిత్సాహి కులనందరినీ సమీకరించి ఎన్నికల సంస్కరణలు, నీరు, విద్య, వైద్యంలపై సదస్సులు నిర్వహించి ప్రయోగాత్మకంగా ఆయా నియోజక వర్గాలలో అన్ని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం ఉండేలా ఎన్నికలలో పాల్గోనాలని జనవాహిని పార్టి ఆలోచన. అవినీతి జాడ్యం దేశాన్ని పట్టి పీడిస్తోంది, అవినీతిలో మునిగి తేలే వాళ్ళు ఏ సామాజిక వర్గాలవారైతేనేమి? మన బ్రతుకులలో వాళ్ళు ఏమి మార్పులు తెస్తారు? ఆ మరకలు మనకు అంటకుండా రాజకీయాలలో పాల్గొని బంగారు భారత్ కోసం పోరాటం చేయాలన్నదే జనవాహిని పార్టీ ఆకాంక్ష..

నేటికి సెలవు

## క్యాప్‌జెమినిలో 20వేల ఉద్యోగాలు

**బెంగళూరు:** ఐటీ ఇండస్ట్రీలో ఉద్యోగాల నియామకంపై నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో ఎంఎన్సీ క్యాప్‌జెమిని మంచి కబురు చెప్పబోతుంది. ఈ ఏడాది భారత్‌లో 20 వేల మందికి పైగా ఉద్యోగులను నియమించుకోవాలని ఈ కంపెనీ యోచిస్తోంది. అంతేకాక ఆటోమేషన్ ప్రభావం ప్రస్తుత ఉద్యోగులపై పడకుండా ఉండేందుకు మే నెల వరకు ఈ కంపెనీ 45వేల మందికి రీస్కిల్ చేపట్టింది. ఈ ఫ్రెంచ్ ఐటీ సర్వీసు కన్సల్టెంట్ గతేడాది 33 వేల మంది ఉద్యోగులను నియమించుకుంది. 51 వేల మందికి రీస్కిల్ చేపట్టింది. తాము ఎక్కువమొత్తంలో పెట్టుబడులను ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ అభివృద్ధి కోసం పెడుతున్నామని క్యాప్‌జెమిని ఆటోమేషన్, ఇండస్ట్రియలైజేషన్ హెడ్ క్రిస్టోఫర్ స్టాన్కోమ్స్ చెప్పారు.


## మన కోసం

| | | | | |
|---|---|---|---|---|
| | శ్రీ విజయలక్ష్మీ జనరల్ స్టోర్స్ | తుళ్ళూరు | చందోలు సత్యనారాయణ | 9441411432 |
| రెస్టారెంట్స్ | బిర్యానిస్ | విజయవాడ | బిర్యానిస్ | 7032202222 |
| | స్వాగత్ మెస్(వెజ్) | మల్కాపురం | చిగురుపాటి | 90329 58580 |
| | ఎస్.ఆర్.కె. గ్రాండ్ | మందడం | శ్రీనివాస్ | 9553023388 |
| షాప్స్ | రేమాండ్స్‌టైలర్స్ | తుళ్ళూరు | ఎస్.కె. జాని | 9492470426 |
| | వర్షిత ఫోటోస్టాట్ | రాయపూడి | పోతురాజు | 9985853188 |
| | బిస్మిల్లా పెయింటింగ్ వర్క్స్ | రాయపూడి | షేక్. మజీదు | 7095880828 |
| | కె.జి .ఎన్. కారు ట్రావెల్స్ | రాయపూడి | ఎస్.కె.సుబాని | 97040 74820, |
| | వైభవ్ డ్రస్సెస్ | తుళ్ళూరు | ఎస్‌వి. పున్నారావు | 9848407935 |
| | చైతన్య గోదావరి బ్యాంకు | రాయపూడి | | 08645244266 |
| | ఉంగరాల హుస్సేన్ టెంట్‌హౌస్ | రాయపూడి | ఉంగరాలఖాజ | 9441275466 |
| | అంజుమన్ టెంట్ హౌస్ | రాయపూడి | పఠాన్ బాషా ఖాన్ | 9502085516 |
| ట్రేడర్స్ | సాయి గణేష్ | వెలగపూడి | జొన్నలగడ్డ మనోజ్ కుమార్ | 7382371111 |
| | శ్రీ చంద్రిక | రాయపూడి | కోలా శ్రీనివాసరావు | 908073516 |

**మ్యారేజీ లింగ్స్**

షేక్ జానీ విజయవాడ 9948450761


## రాజధానికి ఆవులు



**రా.వా.తుళ్ళూరు :** పశుగ్రాసం కోసం రాజధాని ఆవులు తరలి వస్తున్నాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే 10 పర్యాయాలు రాజధాని గ్రామాల్లో వర్షాలు కురిశాయి. తుళ్ళూరు మండలంలోని 16 గ్రామాలు రాజధాని పరిధిలోకి చేరాయి. 20 వేల ఎకారల భూమి బీడుగా మారింది. రెండున్నర సంవత్సరాలుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందినకాపరలు ఆవులు,గొర్రెలు,మేకలు,గేదెలను తోలుకుని వస్తున్నారు. జూన్ నుంచి ఫిబ్రవరి మాసం వరకు రాజధానిలో పశుగ్రాసం దొరుకుతుంది. ప్రకాశం జిల్లా పుల్లల చెరువుకు చెందిన 2 వేల ఆవులు గురువారం తాడికొండ మీదుగా రాజధానికి తరలివెళ్లాయి. తమ ప్రాంతంలో పశుగ్రాసం కొరత ఏర్పడిందని,రెండు మాసాలు తెనాలి పరిసర ప్రాంతాల్లో పశువులను మేపుకున్నామని,కృష్ణా డెల్టాకు నీరు విడుదల చేయడంతో వరి పంటను సాగుచేసేందుకు రైతులు సిద్ధపడుతున్న నేపథ్యంలో ఆవులను మేపుకునేందుకు రాజధాని తరలివెళ్తున్నామని పశు పులకాపరి పల్లంపాటి వెంకటేశ్వర్లు తెలిపారు.

## విజయవాడ,విశాఖలో మాగ్లేవ్ రైలు!

**రా.వా.అమరావతి:** మూడేళ్లుగా తెలుగుదేశం ప్రభుత్వం రాజధాని నిర్మాణంతోసహా అనేక విషయాలపై అధ్యయనం చేయడానికి ప్రపంచ వ్యాప్తంగా ముఖ్యమంత్రులు మంత్రులు, అధికారులు పర్యటనలు జరుపుతున్నారు. విజయవాడ, విశాఖపట్నాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రవాణా మార్గాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పురపాలక మంత్రి నారాయణ చైనాలో పర్యటన జరిపి మాగ్లేవ్ రైలు వ్యవస్థను పరిశీలించారు. మాగ్లేవ్ రైలు వ్యవస్థను పురపాలకశాఖ మంత్రి పి నారాయాణ పరిశీలించారు. మంత్రి నేతృత్వంలోని బృందం మూడ్రోజులుగా మలేసియా,చైనాలో పర్యటిస్తున్నారు. చైనాలోని చాంగ్షా, ఝురుఝౌ నగరాల్లో పర్యటించి,మాగ్లేవ్ రైలులో ప్రయాణించారు. పట్టాలకు 8 మిల్లీమీటర్ల ఎత్తున గాలిలో తేలుతూ ప్రయాణించడం ఈ రైలు ప్రత్యేకత. ఈ వ్యవస్థకు సంబంధించి అక్కడి అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. మాగ్లేవ్ రైలు మూడు బోగీలతో నడుస్తుంది. ఎలక్ట్రో మేగ్నటిజం ఫోర్స్‌తో నడిచే ఈ రైలు ఎలాంటి కుదుపులు లేకుండా పరుగులు తీస్తుంది. సాధారణ రైళ్లకుండే రణగొణ ధ్వనులు లేకుండా నిశ్శబ్ధంగా నడిచే ఈ రైలు ప్రయాణం సుఖవంతంగా ఉండగలదని నిర్వాహకులు తెలిపారు. విజయవాడ, విశాఖల్లో మెట్రో రైళ్లకు బదులుగా మాగ్లేవ్ రైలు ప్రయోజనకరంగా ఉండగలదని మంత్రి అభిప్రాయపడ్డారు. పర్యటనలో మంత్రి వెంట పురపాలకశాఖ ప్రధాన కార్యదర్శి కరికాల వలవేన్,అమరావతి మెట్రో రైలు ఎండీ రామకృష్ణారెడ్డి, ఉన్నతాధికారులు ఉన్నారు.




# భారత్ 'బంగారు' కొండ

- పసిడి వినియోగంలో మనదే అగ్రస్థానం
- ప్రతి ఒక్కరికీ బంగారంతో అనుబంధం
- ధర ఎంత పెరిగితే అంత గిరాకీ

మన దేశంలో బంగారం అంటే నచ్చని వారు , కాస్త ఎక్కువ డబ్బులు ఉంటే ఈ పచ్చలోహాన్ని కొనుగోలు చేయని వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. డబ్బు ఎంత ఉన్నా అది పైకి కనిపించదు. కానీ బంగారం మాత్రం తమ హోదాను క్షణాల్లోనే తెలియజేయడానికి ఉపయోగపడుతుంది. ప్రతిష్ఠ కోసం కొంత మంది, ఆభరణాల అభిరుచితో మరికొంత మంది బంగారం వైపు మొగ్గుచూపుతుంటే.. పెట్టుబడిగా కూడా కొందరు పసిడికి పెద్దపీట వేస్తున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని వారి ఇంట్లోనూ ఎంతో కొంత బంగారం ఉంటుంది. అందుకే మన దేశం బంగారం వినియోగంలో ప్రపంచంలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. పురాతన కాలం నుంచే కనకం భారత సంస్కృతిలో అంతర్భాగమై పోయింది. తరాలు మారినా ఇది అలాగే కొనసాగుతోంది. అందుకే భారత్ బంగారు కొండలా మారిపోయింది. అన్ని తరగతుల వారిని ఆకట్టుకునే విధంగా నూతన ఆభరణాలు వస్తున్న నేపథ్యంలో వాటి అమ్మకాలు క్రమంగా పుంజుకుంటున్నాయి. బంగారం ధర తక్కువ ఉన్నప్పుడు కొనుగోళ్లకోసం అంతగా ఆసక్తి చూపని జనం ధర పెరుగుతుంటే మాత్రం ఇంకా పెరుగుతుందేమోనన్న ఆందోళనతో కొనుగోళ్లు చేస్తున్న సందర్భాలు అనేకం ఉన్నాయి.

**25 వేల టన్నులకు పైగా బంగారం..**

మన దేశంలో ప్రతి ఇంటిలోనూ ఎంతో కొంత బంగారం కచ్చితంగా ఉంటుంది. అది నగరూపంలోనైనా నాణేలా రూపంలోనైనా ఉండవచ్చు. అనేక దేశాల్లో విలాసవంతమైన కార్లు సొంత ఇళ్లకు, ఇతర విలాసాలకు అధిక ప్రాధాన్యం ఇస్తుంటే మన దేశంలో బంగారానికి పెద్దపీట వేస్తున్నారు. ఒక విధంగా చెప్పాలంటే.. బంగారం సెంటిమెంట్‌తో ముడిపడి ఉంటుంది. సంస్కృతి, సాంప్రదాయాల్లో ఇది ఒక భాగం. కాబట్టి ఈ లోహాన్ని ఎవరూ కాదనుకోరు. అందుకే భారత్‌లో ఏటా బంగారం డిమాండ్ ఊపందుకుంటోంది. బిలియన్ వ్యాపార వర్గాలు, ప్రభుత్వ అంచనా ప్రకారం మన దేశంలోని కుటుంబాల వద్ద కనీసం 25,000 టన్నుల బంగారం ఉంటుంది. దేవాలయాలు, ట్రస్టులు, ఇతర సంస్థల వద్ద ఇంకా పెద్ద మొత్తంలో పసిడి ఎక్కువగా ఉంది.

**ఆంక్షలు, నిబంధనలు**

మన దేశంలో ముడిచమురు తర్వాత అధికంగా విదేశాల నుంచి దిగుమతి అవుతున్న కమోడిటీల్లో బంగారం రెండో స్థానంలో ఉంది. ఈ రెండింటి ఉత్పత్తి మన దేశంలో చాలా తక్కువగా ఉంది. కానీ వినియోగం మాత్రం విపరీతంగా పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలోనే విదేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఫలితంగా బంగారం, ముడిచమురు కోసం అధిక మొత్తంలో విదేశీ మారక నిల్వలను వెచ్చించాల్సి వస్తోంది. దీంతో దేశ కరెంట్ ఖాతా లోటు (క్యాడ్) అధికంగా పెరిగిపోతోంది. దీన్ని అదుపులో ఉంచేందుకు అటు ప్రభుత్వం, ఇటు భారత రిజర్వు బ్యాంకు గతంలో కఠినచర్యలు తీసుకున్న సందర్భాలు చాలా ఉన్నాయి. దేశంలోకి బంగారం దిగుమతులు పెరగకుండా ఉండేందుకుగాను బంగారం దిగుమతులపై సుంకాన్ని ప్రభుత్వం పది శాతానికి పెంచింది. ఒక దశలో 80:20 నిష్పత్తి నిబంధనను అమల్లోకి తెచ్చింది. అంటే దిగుమతి చేసుకున్న బంగారంలో 20 శాతం మళ్లీ విదేశాలకు ఎగుమతి చేయాలి. దీని వల్ల మన దేశానికి విదేశీ మారక నిల్వలు లభిస్తాయన్న మాట.



ఈ ఏడాదిలో 750 టన్నులకు బంగారం డిమాండ్‌పెద్ద నోట్ల (500, 1000) రద్దుతో పాటు ఎక్సైజ్ సుంకాన్ని పెంచిన ఫలితంగా గత ఏడాదిలో మన దేశంలో బంగారం డిమాండ్ 600 టన్నుల వరకు ఉంది. అంతకు ముందు కాలంలో డిమాండ్ 850-900 టన్నుల వరకు ఉండేది. అయితే ప్రభుత్వ ఆంక్షల నేపథ్యంలో కొన్నేళ్లపాటు డిమాండ్ ప్రభావితమైంది. ఇక ఈ ఏడాదిలో పసిడికి గిరాకీ 650-750 టన్నుల వరకు ఉండవచ్చని ప్రపంచ స్వర్ణ మండలి అంచనా వేస్తోంది. దేశీయ బంగారం మార్కెట్లో పారదర్శకత పెరుగుతున్న తరుణంలో 2020నాటికి బంగారం డిమాండ్ 850-950 టన్నుల స్థాయికి చేరుకుంటుందని అంటున్నారు.

పెద్ద నోట్ల రద్దు బంగారం కొనుగోళ్లపై తీవ్ర ప్రభావం పడింది. జనం చేతుల్లో డబ్బులు లేకపోవడంతో బంగారం దుకాణాలవైపు వెళ్లే వారి సంఖ్య తగ్గిపోయింది. ఫలితంగా ఆభరణాల దుకాణాలు వెలవెలబోయాయి. అయితే ఇప్పుడు పరిస్థితి కాస్త మారిపోయింది. బ్యాంకుల నుంచి నగదు తీసుకునే పరిమితిని ఎత్తివేసిన నేపథ్యంలో బంగారం కొనుగోళ్లు మళ్లీ పుంజుకుంటున్నాయి. ఇక రెండు లక్షల రూపాయలకు మించిన బంగారం, ఆభరణాలు కొనుగోలు చేస్తే పర్మినెంట్ అకౌంట్ నెంబర్ (పాన్) వివరాలు ఇవ్వాలన్న ప్రభుత్వ ఆంక్షలతో బంగారం కొనే ముందు కాస్త ఆలోచించే వారి సంఖ్య ఎక్కువవుతోంది. ఈ నేపథ్యంలో బంగారాన్ని కొనుగోలు చేయాలనుకునే వారు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారిస్తున్నారు. ప్రముఖ స్టాక్ మార్కెట్లు ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ (ఇటిఎఫ్) రూపంలో బంగారాన్ని కొనుగోలు చేసే సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. దీని ద్వారా నచ్చినంత బంగారాన్ని ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేయవచ్చు. అవసరం ఉన్నప్పుడు వెంటనే విక్రయించుకోవచ్చు. చాలా మంది ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల్లో బంగారానికి కూడా ప్రాధాన్యం ఇస్తుంటారు. అనుకోని కారణాల వల్ల స్టాక్ మార్కెట్లు నష్టాలపాలయినప్పుడు తమ పెట్టుబడులకు బంగారం తగిన రక్షణ ఇస్తుందన్నది ఇన్వెస్టర్ల విశ్వాసం. ఈ నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు పెరుగుతుంటే తమ బంగారంలో పెట్టుబడులను వెనక్కి తీసుకుని ఆ సొమ్మును స్టాక్ మార్కెట్లో పెట్టుబడిగా పెడతారు. స్టాక్ మార్కెట్ వెనుకడుగు వేసినప్పుడు షేర్లలోని పెట్టుబడులను బంగారంలోకి మళ్లిస్తారు.

**సావరిన్ గోల్డ్ బాండ్లు**

పసిడి కొనుగోళ్లను తగ్గించడానికి ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు విధించిన ప్రజలు మాత్రం తమ ఆలోచనను మార్చుకోవడానికి సుముఖత వ్యక్తం చేయలేదు. ఈ నేపథ్యంలో బంగారానికి ప్రత్యామ్నాయంగా కొనుగోలు చేయడానికి సావరిన్ గోల్డ్ బాండ్లను అందుబాటులోకి తెచ్చారు. వీటిని ప్రభుత్వం తరపున భారత రిజర్వు బ్యాంకు (ఆర్‌బిఐ) జారీ చేస్తోంది. వీటిని వ్యక్తులే కాకుండా హిందూ యునైటెడ్ ఫ్యామిలీలు, ట్రస్టులు, యూనివర్సిటీలు, చారిటేబుల్ ఇనిస్టిట్యూషన్లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఒక్కో గ్రామును ఒక్కో యూనిట్‌గా లెక్కిస్తారు. గరిష్ఠంగా ఎనిమిదేళ్ల కాలానికి ఈ బాండ్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఐదేళ్ల తర్వాత వీటిని నగదులోకి మార్చుకోవచ్చు. ఈ బాండ్లపై ఇచ్చే వడ్డీ రేటు 2.5 శాతం. బ్యాంకులు, స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, పోస్టాఫీసులు, స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా వీటిని కొనుగోలు చేయవచ్చు. 2015 నవంబర్‌లో ఈ బాండ్లను మొదటిసారిగా ప్రారంభించారు. ఇప్పటి వరకు ఎనిమిది విడతల్లో 5,400 కోట్ల రూపాయల విలువైన బాండ్లను జారీ చేసినట్టు ఇటీవలే భారత రిజర్వు బ్యాంకు ప్రకటించింది.

– బోస్

### నడిపించేది అంతర్జాతీయ మార్కెటే..

భారత్ ఇంత పెద్ద మార్కెట్ అయినప్పటికీ అంతర్జాతీయ మార్కెట్లో ధరలకు అనుగుణంగానే ఇక్కడి ధరలు ఎప్పటికప్పుడు ప్రభావితం అవుతుంటాయి. అంతర్జాతీయంగా చోటు చేసుకునే రాజకీయ, ఆర్థిక, ఇతర విపత్కర పరిణామాల ప్రభావం స్టాక్ మార్కెట్లపై వెంటనే పడుతుంది. స్టాక్ మార్కెట్లు కుప్పకూలతాయి. ఇలాంటి తరుణంలో ఇన్వెస్టర్లు వెంటనే రక్షణ చర్యలకు దిగి బంగారాన్ని కొనుగోలు చేస్తుంటారు. ఫలితంగా పసిడి ధర పెరగడం మొదలవుతుంది. ఇలా జరిగిన సందర్భంలో అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర భారీ హెచ్చుతగ్గులకు గురవుతుంది. ఆ ధరకు అనుగుణంగా భారత మార్కెట్లో ధరలు మారుతుంటాయి. దేశీయంగా పండగలు, పెళ్లిళ్లు, అక్షయ తృతీయలాంటి ప్రత్యేక సందర్భాల్లో పసిడికి గిరాకీ మరింత ఎక్కువగా ఉండటం వల్ల ధరలు పెరుగుతుంటాయి.

# సచివాలయానికి అదనంగా 10 గేట్లు

**రా.వా ప్రతినిధి అమరావతి :** తాత్కాలిక సచివాలయానికి అదనంగా పది గేట్ల ఏర్పాటుకు ప్రభుత్వం చకచకా పనులు చేపట్టింది. అందులో భాగంగా ఇప్పటికే నిర్మించిన సచివాలయ వెనుక భాగంలోని ప్రహరీగోడను గేట్ల నిర్మాణాలకు అనుకూలంగా పగలకొట్టారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతి (వెలుగపూడి)లో ఉన్న సచివాలయానికి వాస్తు దోషం పట్టిందని, దానిని తొలగించేందుకు వెనుకవైపున ఉన్న గేట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటివరకు సచివాలయంలోని 2వ బ్లాకుకు వీధిపోటు ఉందని గతంలోనే వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఏకంగా సచివాలయానికే వాస్తుదోషం ఉందని తెలియటంతో ప్రభుత్వం నిర్మాణాలకు పూనుకుంది. వాస్తుదోషం నివారణను ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు మీడియా సమావేశంలోనే సమర్థించుకోవడం గమనార్హం. వాస్తును ఆచరించటంలో తప్పేమీ లేదని వ్యాఖ్యానించారు. ఉదయం నుండి సచివాలయం లోని 2,3 బ్లాకుల వెనుక ఉన్న మెయిన్ కాంపౌండ్‌ను కార్మికులు పగలకొట్టారు. ఇప్పటివరకు సచివాలయానికి నాలుగు ప్రధాన గేట్లు ఉన్నాయి. ముందు భాగంలో ఉన్న రెండు గేట్లలో ఒక గేటు నుండి ఉద్యోగులు, సందర్శకులు లోపలికి ప్రవేశిస్తారు. మరో గేటు నుండి ముఖ్యమంత్రి, మంత్రులు ఇతర ఉన్నతాధికారులు ప్రవేశిస్తారు. అసెంబ్లీ వెనుక ముఖ్యమంత్రి ఉండే 1వ బ్లాకును దక్షిణ భాగంలో రెండు గేట్లు ఉన్నప్పటికీ ఇప్పటివరకు వాటిని ఉపయోగిచలేదు. వాస్తుదోషం ఉందని తెలియడంతో అధికారులు కొత్త గేట్లు అమర్చేందుకు రంగంలోకి దిగారు

**ముఖ్యమంత్రికి అత్యవసర మార్గం**

మొత్తం పది గేట్లను సచివాలయానికి కొత్తగా ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. సచివాలయంలో సందర్శకుల మార్గం ద్వారా ప్రవేశంతో ముందుగా 5,4 బ్లాకులు దర్శనమిస్తాయి. ఆ రహదారికి నేరుగా అసెంబ్లీ వెనుకభాగంలో ముఖ్యమంత్రి ఉండే 1వ బ్లాకుకు దక్షిణ భాగాన ఇప్పటివరకు ఉపయోగించని ప్రధాన గేట్లకు ఉత్తరదిక్కున కొత్తగా రెండు మెయిన్‌గేట్లు, వాటి పక్కనే మరో రెండు చిన్న గేట్లు ఏర్పాటు చేస్తున్నారు. 5వ బ్లాకుకు పక్కగా ఉన్న రోడ్డు ద్వారా అసెంబ్లీకి ఉత్తరాన ఉన్న మెయిన్ గేటుకు ఎదురుగా రెండు పెద్దగేట్లు, మరో రెండు చిన్న గేట్లు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం 3వ బ్లాకుకు వెనుక పగలకొట్టిన గోడ ప్రాంతంలో ఓ పెద్ద గేటు, మరొక చిన్న గేటు ఏర్పాటు చేయనున్నారు. వీటన్నింటినీ లెక్కిస్తే ఇప్పుడున్న 4 గేట్లకు అదనంగా 10 గేట్లు ఏర్పాటు చేసి సచివాలయ వాస్తును సరిచేయనున్నారని తెలుస్తోంది. మంత్రులు, పలు శాఖల ఉద్యోగులు, ఉన్నతాధికారులతో పాటు క్యాంటీన్ ఉన్న 4,3,2 బ్లాకులతో పాటు ముఖ్యమంత్రి ఉండే 1వ బ్లాకు వెనుక ఉన్న రోడ్డును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెళ్లేందుకు అత్యవసర మార్గంగా రూపొందిస్తున్నారు. ఇప్పటికే వాస్తు దోషం పేరుతో మంత్రుల పేషీలను కోట్ల రూపాయల వెచ్చించి ఒకటికి నాలుగుసార్లు మరమ్మతులు చేపట్టిన ప్రభుత్వం మరో మారు గేట్ల నిర్మాణాలకు ఎంత వెచ్చించనున్నదో అర్థం కావటం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

# జియోపై రిలయన్స్ కన్నెర్ర..!

**న్యూఢిల్లీ :** టెలికాం మార్కెట్లో ప్రకంపనలు సృష్టించిన 'జియో' అంబానీ బ్రదర్స్ మధ్య చిచ్చు పెట్టింది.జియో పై ఆర్‌కాం సంచలన ఆరోపణలు గుప్పింది.ముకేష్ అంబానీ గ్రూపునకు చెందిన రిలయన్స్ జియో ఫ్రీ ఆఫర్ల వల్లే పరిశ్రమ తీవ్ర నష్టాలపాలైందని,అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ కమ్యూనికేషన్స్ ఆరోపించింది.కస్టమర్లను ఆకట్టుకునేందుకు,మార్కెట్ షేర్ పెంచుకునేందుకు జియో అనుసరించిన విధానాలపై సంచలన ఆరోపణలు చేసింది.దేశీయ టెలికాం కంపెనీ నష్టాలకు జియో అనుసరించిన ఫ్రీ ఆఫర్లు కొంతమేరకు ప్రభావం చూపించాయంటూ ఆర్‌కాం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఆరోపించింది.అప్పుల ఊబిలో కూరుకుపోయి అష్టకష్టాలు పడుతున్న ఆర్‌కాం జియోపై పలు ఆరోపణలు గుప్పించింది.మార్కెట్లోకి కొత్తగా ఎంట్రీ ఇచ్చిన జియో కారణంగానే టెలికాం కంపెనీలు భారీగా నష్టపోయాయని ఆర్‌కాం ఆరోపించింది.చరిత్రలో మొట్టమొదటిసారిగా టెలికాం ఆపరేటర్ల అప్పులు వాటి మార్కెట్ క్యాపిటలైజేషన్ మించిపోయిందని పేర్కొంది.రుణ పెరుగుదల, రాబడి క్షీణించడం ఫలితంగా,టెలికాం కంపెనీల రుణ సేవల సామర్థ్యాలు ప్రతికూలంగా ప్రభావితమయ్యాయని తెలిపింది.

# మమతా త్రివేదీ.. మిసెస్ ఇండియా 2017



**నాంపల్లి:** మిసెస్ ఇండియా- 2017గా నగరానికి చెందిన మమతా త్రివేదీ ఎంపి కయ్యారు. ఈ నెల 4న చెన్నైలో నిర్వహించిన మిసెస్‌ఇండియా పోటీల్లోదేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి 48 మంది పాల్గొనగా 45 ఏళ్లవయస్సుపైబడినమమతతెలంగాణనుంచిప్ర పాతినిధ్యంవహించిమిసెస్‌ఇండియా- 2017గా ఎంపికయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని బనారస్‌కు చెందిన మమత తండ్రి వింధ్యాచల్ త్రిపాఠీ వృత్తిరీత్యా50 ఏళ్ల కిందటే నగరానికి వచ్చిఅత్తాపూర్ ప్రాంతంలో స్థిరపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి సైకాలజీలో పట్టభద్రురాలైన మమత మోడలింగ్ రంగం పట్ల ఆసక్తితో ఆ రంగంలో కొనసాగుతూ వచ్చారు. 1990లో అత్తాపూర్‌కు చెందిన చార్టెర్డ్ అకౌంటెంట్ పంకజ్ త్రివేదీని పెళ్లి చేసుకున్నారు. వీరికో కుమార్తె కుమారుడు. మోడల్‌గా రాణిస్తూనే నాలుగు నెలలుగా కష్టపడి మిసెస్ ఇండియా పోటీలకు సన్నద్ధమైనట్లు మమత వివరించారు.




Printed by Pattan Hussain Khan, published by Pattan Hussain Khan on behalf of Vastitude media pvt ltd.and printed at Jagathi Publications Ltd.
D.No: 5-625,Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. publised at Guntur. Editor: Pattan Hussain Khan,
Ph: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18